# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక



సంపుటి: 26 సంచిక: 01 హైదరాబాద్ 2026 మే పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-

# 1935లో బాబా సమాధికి ఎదురుగా ఏర్పాటు చేసిన

# ఫెన్సింగ్ - గేట్







ఈ ముఖచిత్ర కథనానికి
సంబంధించిన వార్త
పేజి 16లో చదువుకుందాం!

ఖాజాగూడలోని మనోనాశ్ గుహ ఆషామాషీ ప్రాంతం కాదు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత గలది. మెహెర్‌బాబా ఇక్కడ ఏకాంతవాసం, మనోనాశ్ కార్యక్రమాన్ని యావత్ విశ్వ శ్రేయస్సు కోసం నిర్వహించారు. 2000 సంవత్సరం వరకూ ఈ ప్రాంతం అడ్రస్సు చెప్పడం కూడా చాలా కష్టంగా వుండేది. కొండ ఎక్కడానికి మెట్లులేవు. కొండ రాళ్ళను పట్టుకుని మనోనాశ్ గుహకు చేరేవారు. నేడు ఈ ప్రాంతంలో వచ్చిన మార్పు అనూహ్యం. అవతారుని పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రాంగణంలో ఈ ఏడాది అక్టోబరులో నిర్వహిస్తున్న అమృతోత్సవ వేడుకలలో తప్పక పాల్గొనే ప్రయత్నం చేయవల్సింది.

## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 05 |
| 2. | అవతారుడి స్వీయ రచన | 06-07 |
| 3. | నారిమన్-ఆర్నవాజ్ | 08-15 |
| 4. | ముఖ చిత్ర కథనం | 16-17 |
| 5. | లార్డ్ మెహెర్ | 20-25 |
| 6. | ఉదతార మైలు రాయి | 26 |
| 7. | మా మాటలు | 28-30 |
| 8. | పుస్తక సమీక్ష | 31-33 |
| 9. | అక్షరాభ్యాసం | 34 |
| 10. | కర్మకాండలు | 35 |
| 11. | బాబావారి సందేశం | 36-38 |
| 12. | మా ప్రచురణలు | 39 |
| 13. | జీవితసభ్యులు | 40 |



గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
99595-53218,
malladisukku@gmail.com

వ్యవస్థాపకులు:
శ్రీ దశిక ప్రసాదరావు



ఉత్తర ప్రత్యుత్తరాలకు

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


ముఖ చిత్రం

మెహెర్‌బాబా సమాధి ప్రాంగణం, మెహెరాబాద్

### మనవి

మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవల్సింది. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 26న హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం.

***

# మనోనాశ్ -అమృతోత్సవ వేడుకలు

**1951 -2026**

- హైదరాబాద్‌లోని ఖాజాగూడా గుహ సమీపంలో
- రెండు రోజుల 75వ మనోనాశ్ వార్షికోత్సవ వేడుకలు
- 2026 అక్టోబరు 17, 18 తేదీలలో
- వసతి సౌకర్యం కోరువారు వాట్సప్ 98490 46848, 96524 22599, 9396702076, 924652609 సంప్రదించగలరు.
- **ఆఖరు తేది 2026 జూలై 31.** అందరూ ఆహ్వానితులే.

***

**హైదరాబాద్ అంటే తనకెంతో ఇష్టం అన్నారు మెహెర్‌బాబా. ఆధ్యాత్మికంగా ఈ నగరం భాగ్యనగరమేనన్నారు.** ఈ అదృష్టం ఎన్నో యుగాలుగా సంప్రాప్తించిందన్నారు. 1949 అక్టోబర్ 16న బాబా నవజీవనం ప్రారంభించిన విషయం పాఠకులకు తెలుసు. నవ జీవనానికి ముగింపుగా 1951 అక్టోబరు 16 నుండి 23 దాకా ఖాజాగూడ కొండపై వున్న చిన్న గుహలో మెహెర్‌బాబా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. 1951 అక్టోబరు 24న హైదరాబాద్ నుండి కాలినడకన మెహెరాబాద్‌కి బయల్దేరారు. మనోనాశ్ కార్యక్రమం చేపట్టడానికి మునుపు మెహెర్‌బాబా ఈ క్రింది సందేశాన్ని ఇచ్చారు.

## మనోనాశ్ అంటే?

**'మనస్సు సంస్కారాల పుట్ట. అహంకారానికీ, మమకారానికీ మనస్సు పదునుపెడ్తుంది.** శరీరం వున్నంతకాలం మనస్సు వుంటుంది. దీంతో క్రొత్త సంస్కారాలు ప్రోది అవుతూనే వుంటాయి. ఇదొక విషవలయం. ఇందులోంచి బయటపడాలంటే, ఏ పని చేసినా ఫలితం ఆశించక, భగవంతుడిపై భారం వేసి జీవించు. తద్వారా ఎలాంటి సంస్కారాలు మీ దరి చేరవు. కానీ ఇది చాలా కష్టం. నిస్వార్ధ సేవ, ధ్యానం, భక్తి ఇలా ఏ మార్గమైనా మనోనాశ్‌కే దారి తీస్తుంది. మనస్సు మనల్ని తప్పు దారి పట్టిస్తుంటుంది. ఆ మనస్సే పోతే, ఈ శరీరానికి ఏమీ పట్టదు. **మనోనాశ్‌తో జ్ఞానం సిద్ధిస్తుంది. జ్ఞానం అంటే అహం బ్రహ్మాస్మి స్థితి అని** బాబా ప్రవచించారు.
**అవతారుని మనోనాశ్ స్మృతులు స్మరించుకునేందుకై ఏర్పాటు చేసిన ఈ వార్షికోత్సవ వేడుకలలో బాబా ప్రేమికులు సపరివారంగా పాల్గొనవల్సింది.**

### పత్రిక 25 ఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తిచేసుకుంది

# రెండు అక్షరముల నామమే

**సంసార జలధిని దాటించగలది రెండు అక్షరముల నామమే!**
అలనాడు అయినా, ఇలనాడైనా! నిస్సందేహంగా!
పరమపద సోపాన పథంలో కొట్టిమిట్టాడుతున్న మన అందరి జీవనగమ్యం
అవతారుని పథం కావాలీ అంటే,
రింగు రింగుమని మ్రోగాలి చెవిలో భగవన్నామం.
నిత్యం మననం కావాలి, అవతారుని ప్రతిమాట.
ఆ మధురోక్తులపై వచ్చిన భాష్యం చదవాలి ఏకాగ్రతతో దృష్టిపెట్టి.
ఆ సువార్తని నలుగురి చెవిన వేయాలి. కనీసం ఆ ప్రయత్నం చేయించాలి.

**మహా మహా పత్రికలకే పాఠకులు కరువు అవుతున్న ఈ యుగంలో ఇదొక బృహత్ యజ్ఞం!** అయితే, అసాధ్యం కూడా సుసాధ్యం అవుతుంది ప్రేమతో ప్రయత్నిస్తే అన్న మెహెర్ సుభాషితంతో ప్రేరణ పొందిన దశిక ప్రసాదరావు ఈ యజ్ఞ దీక్ష పట్టారు. మీరు ప్రతినెలా చూస్తున్న, చదువుతున్న మెహెర్‌బాబా పత్రికకి శ్రీకారం చుట్టారు, ఇరవై అయిదు వసంతాల క్రిందట. వోనమాలు చదువుతున్నప్పుడే యుగావతారుని దర్శించి తరించిన అదృష్టవంతుడు దశికవారు. ఆయన వొరవొడిలో కదుల్తూ, ప్రేమ గనిని త్రవ్వుతూ కొత్త కొత్త శీర్షికలతో ఆసక్తికర కథలకీ, ఆ కథల వెనుక కథలికీ అద్దం పడుతోంది మీ (మా) పత్రిక. ఆయా కథలని పుస్తక రూపంలో అందిస్తోంది పాఠకలోకానికి. తద్వారా మెహెర్ సాహిత్య వ్యాప్తికి దోహదం చేస్తోంది.

**ఇరవై ఆరవ ఏట అడుగుపెడ్తున్న శుభ సమయంలో ప్రేమారాధన చేస్తున్న వారికి, ప్రేమాను భూతిలో** మునిగి తేలిపోతున్నవారికి, ప్రేమానుభూతి పొందాలనుకొనేవారికీ, అందరికీ మెహెరీశుని నామామృతాన్ని అందించే ప్రయత్నం మరింత శ్రద్ధతో, భక్తితో, ప్రేమతో చేస్తామని వినమ్రంగా మనవి చేస్తున్నాము.

**మా యీ యత్నానికి యుగావతారుని ప్రేమాశీస్సులు మెండుగా వుంటాయనీ, మెహెరు** పాఠకుల అండదండలు పుష్కలంగా లభిస్తాయనీ ఆశిస్తున్నాము. జయహో మెహెర్‌బాబా!

**॥మ.రా.రా॥**

# అవతారుడి స్వీయ రచన
# 'హరి, పరమాత్మ .., ప్రార్థనా గీతం'



**"హరి, పరమాత్మ,**
**అల్లా,**
**అహుర్మజ్దా, గాడ్**
**యాజ్‌దాన్,**
**హూ..."**

ఈ గీతం – బాబావారి స్వీయ రచన. సంగీత స్వరకల్పన కూడా బాబానే చేశారు. 1927 జూన్ 16న ఈ గీత రచన జరిగింది. మెహెరాబాద్ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కోసం, బాబా ఈ గీతాన్ని రాశారు. భగవన్నామస్మరణే ఈ గీతంలో ప్రధానాంశం.

ఈ గీతంలో దేవుని పేర్లు 'ఏడు' వున్నాయి.
అన్ని మతాలు ఘోషించేది "దేవుడు ఒక్కడే" అన్నది
ఈ గీత సారాంశం, అన్నారు మెహెర్‌బాబా.

***

మెహెరాశ్రమ బాలుర్ని ప్రతినిత్యం ఈ గీతాన్ని ఆలాపించమన్నారు బాబా. ప్రతిరోజూ ఉదయాన్నే ఒక విద్యార్థి ఈ 'భగవన్నామావళిని' ఆలాపిస్తే, మిగిలిన విద్యార్థులందరూ కోరస్‌గా పాడేవారు. సుమారు పదిహేను నుండి ముప్పై నిమిషాలు బాలురు ఈ గీతాన్ని ఆలాపించేవారు.

**అలాగే,**

మెహెరాశ్రమంలో, క్లాసు ప్రారంభంలో ఒక ఐదు నిముషాలు,
తరగతి ముగింపులో మరో ఐదు నిముషాలపాటు, విద్యార్థులందరూ
సూర్యభగవానుడికి నమస్కరిస్తూ ఈ ప్రార్థన చేసేవారు.
(లార్డ్ మెహెర్ పేజి. 825).




## 1940 జూలైలో, తన మండలితో బాబా ఇలా అన్నారు.

ఈ ఏడు భగవన్నామాల్ని ఒక కాగితంపై రాసుకోండి.
కంఠస్తం చేయ్యండి. భగవన్నామం ఏదైనా, దేవుడు ఒక్కడేనన్న భావంతో
ఆలాపించండి. మీ హృదయాంతరాళ్ళ నుండి ఈ నామం స్మరించండి.
ఈ నామస్మరణ వల్ల ఉద్భవించే 'ఆధ్యాత్మిక తరంగాలు',
నా ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఎంతగానో సహాయపడతాయి.
నా ఆదేశాలు తుచ తప్పక పాటిస్తే,
మీరు నాకు ఎంతగానో సహాయం చేసిన వారౌతారు.
నా సహాయం మీకు తప్పక లభిస్తుందని బాబా హామీ ఇచ్చారు.
(లార్డ్ మెహెర్ ఆన్‌లైన్ పేజి. 2140).

**స్త్రీ మండలి ఆలాపిస్తున్న ఈ గీతాన్ని యూట్యూబ్ లింక్‌లో ఆస్వాదించగలరు.**
https://youtu.be/VNsmzZFmNQY?si=RVNLb-yimQJrJeQL

***

**అవతారుడు మెచ్చిన, ఆదేశించిన ఈ గీతాన్ని ప్రతి సత్సంగ్‌లో తప్పక ఆలాపించే ప్రయత్నం చేద్దాం. జైబాబా.**

‘లోకంలో ఉంటూ - లోకాతీతంగా - జీవించిన ధన్యజీవి’

# నారిమన్ ఎం. దాదా ఛాన్జీ

**31.10.1913 - 2.7.1974**



**నారిమన్ అంటే ‘నిజాయితీపరుడు, నమ్మకమైన వ్యక్తి’** అని తెలుగులో సమానార్థం. నారిమన్ ఈ మాటలకి వన్నె తెచ్చేలా జీవితం గడిపాడు. మెహెరుడి మనస్సు దోచుకున్న ధన్యజీవి నారిమన్. నారిమన్ బాబా ట్రస్టు సభ్యునిగా పనిచేశాడు. బాబా భౌతిక దేహ త్యాగం తర్వాత ట్రస్టులో తలెత్తిన అనేక చిక్కు సమస్య లకు స్కిప్పర్ (నాయకుడిగా) నిలిచాడని ఆనాటి ట్రస్టు చైర్మన్ మణిజా నారిమన్‌ని అభినందించారు. బాబా మండలి సభ్యులందరూ సాధు జీవితాన్ని జీవించగా, నారిమన్ ‘లోకంలో ఉంటూనే, లోకానికి అతీతంగా’ జీవించాడని, బాబా ప్రేమికులు వ్యాఖ్యానిస్తారు. ఇది నూరు శాతం నిజం. గొప్ప వ్యాపారవేత్తగా వుంటూనే, బాబా సేవకు సంపూర్ణంగా అంకితమైన వ్యక్తి నారిమన్ దాదా ఛాన్జీ. ఈయన భార్య పేరు శ్రీమతి ఆర్నవాజ్. ఈ ఆదర్శ దంపతుల గురించి ఈతరం పాఠకులు తప్పక తెలుసుకోవాలి. వీరిద్దరి జీవిత చిత్రాల గురించి ఈ సంచికలో క్లుప్తంగా చదువుకుందాం!.

## మెహెర్‌బాబాతో పరిచయం

**నారిమన్ 1913 అక్టోబర్ 31న జన్మించాడు. మెహెర్‌బాబాకు మొట్టమొదటి వ్యక్తిగత** కార్యదర్శిగా ఉన్న ఫ్రంరోజ్ దాదా ఛాన్జీకి నారిమన్ - మేనల్లుడు. ఈ కుటుంబ నేపథ్యం కారణంగానే నారిమన్‌కు చిన్నతనం నుండే మెహెర్‌బాబాతో అత్యంత సన్నిహిత సాంగత్యం లభించింది. 1930వ సంవత్సరంలో నారిమన్ ఇంగ్లాండ్‌లో కెమిస్ట్రీ చదువుకున్నాడు. ఆ పిదప, అక్కడ నుంచి ఉన్నత చదువులకై జర్మనీకి వెళ్ళాలన్నది అతని ఆలోచన. అయితే, అర్నవాజ్ (నారిమన్‌కు కాబోయే భార్య) ద్వారా వెంటనే భారత దేశానికి తిరిగి రావాలని మెహెర్‌బాబా సందేశం పంపారు. నారిమన్‌కి ఇష్టం లేదు. ఐనప్పటికీ, బాబా ఆదేశాల ప్రకారం స్వదేశానికి తిరిగి వచ్చేశాడు. ఆ దరిమిలా, ఆయన జీవితాంతం బాబాకు విధేయుడిగానే వున్నాడు. **నారిమన్ - అర్నవాజ్ ఇద్దరూ బాబా ప్రేమలో పెరిగారు.**

**వీరిద్దరి మధ్య సన్నిహిత బంధుత్వం** కూడా వుంది. వీరిద్దరూ బాబావారి ఆశ్రమంలో బ్రహ్మచారులుగా ఉండాలనుకున్నారు. ఐతే, **బాబావారి ఆదేశాల మేరకు వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. వీరి వివాహ** నిశ్చితార్థానికి 1942లో బాబా స్వయంగా హాజరయ్యారు. 1944 డిసెంబర్ 21న వీరి వివాహం జరిగింది. "నారిమన్ - ఆర్నవాజ్‌లు గొప్ప ఆదర్శ జంటగా బాబా ప్రేమికుల ప్రశంశలు అందుకున్నారు.

**ముంబాయిలో వున్న వీరి ఇంటిపేరు 'ఆషియానా'. ముంబాయికి బాబా ఎప్పుడు వెళ్ళినా** బాబావారి బస ఆషియానాలోనే ఉండేది. బాబా ప్రేమికులందరూ ఆషియానా ఒక పుణ్య క్షేత్రంగా భావించేవారు. మెహెర్‌బాబా చేపట్టిన 'నవజీవనం' సమయంలో తెర వెనుక వుండి నారిమన్- ఆర్నవాజ్‌లు చక్కని సేవలు అందజేశారు.

## మృదు స్వభావి

**నారిమన్ చాలా మృదు స్వభావి. హుందాగా వుండేవాడు. బాబాతో తన ఆధ్యాత్మిక** అనుభవాలను గానీ, వ్యక్తిగత కష్టాల గురించి, ఎన్నడూ ఇతరులతో పంచుకునేవాడు కాదు. మౌనంగా, గుంభనంగా వుండేవాడు. నారిమన్‌ది ప్రేమ నిండిన హృదయం. తన తోటివాళ్ళనందర్నీ ఎంతో ప్రేమతో పలకరించేవాడు. అందరితో ఆప్యాయతతో వుండే వాడు. వినయం, విధేయత ఆయన సొంతం అన్నట్లు వుండేవాడు. భగవంతుడ్ని వేడుకోలుగా నారిమన్ తన కోసం ఒక ప్రార్థన రాసుకున్నాడు. ఇది ఆయనలోని సద్గుణాన్ని స్పష్టం చేస్తుంది. ఆ ప్రార్థనలో "తనకెన్ని కష్టాలు ఎదురైనా, తన వారు అనుకున్న వారు నిందారోపణలు చేసినా, తన తోటివారి ఆనందం కోసం పరితపించే హృదయం తనకివ్వమని నిత్యం భగవంతుడ్ని ప్రార్థించేవాడు" నారిమన్.

## దైవీ మానవునితో అనుభవం

**నారిమన్ బాబాను తన హృదయపూర్వకంగా ప్రేమించాడు. కానీ, ఎప్పుడైనా దైవీ** మానవునితో మీ అనుభవం గురించి చెప్పమంటే, "నేను బాబాను కలిశాను, ఆయనపట్ల నమ్మకం కుదిరింది. తదాదిగా ఆయన్ని అనుసరించానని, మాత్రం క్లుప్తంగా చెప్పేవాడు. ఇదే నా అనుభవం, అనేవాడు. బాబా బొంబాయికి ఎప్పుడు వచ్చినా నారిమన్ బాబాని వెన్నంటి వుండేవాడు.

**నారిమన్ పట్ల బాబా చూపిన ప్రేమ గురించి ఆర్నవాజ్ తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ** తన స్వీయ రచన 'గిఫ్ట్ ఆఫ్ ది గాడ్' గ్రంథంలో ఇలా చెప్పింది. 'ఒకసారి మేము పూణేలో ఉన్నప్పుడు, ఏదో ఒక విషయమై నారిమన్ చాలా బాధపడ్డాడు. ఆ విషయాన్ని

## నారిమన్ పట్ల బాబా ప్రేమ

ఎంతో కష్టంపై నాతో చెప్పాడు. ఆ విషయాన్ని నేను బాబాతో చెప్పాను. 'నారిమన్ నాకెందుకు చెప్పలేదని' బాబా అన్నారు. అ పిదప, నారిమన్‌ని ఉద్దేశించి బాబా ఇలా అన్నారు. "నువ్వు ఊహించలేనంతగా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను. అంతా బాగవుతుంది. సంతోషంగా ఉండు. చింతించ వద్దు. నిద్రపో, అని సలహా ఇచ్చారు. ఆ తర్వాత, **'నారిమన్ ఎప్పుడు బాధపడినా, నా హృదయం కలత చెందుతుందని, బాబా తనతో అన్నారని,** ఆర్నవాజ్ తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది.

**నారిమన్‌కి ఏదైనా కష్టం వస్తే ఎవరితో చెప్పడు. తనలో తానే కుమిలిపోతాడు. అవతారునికి** తెలియనిది ఏముంటుందని ఆర్నవాజ్ ఇలా చెప్పింది. ఒకసారి నేను గురుప్రసాద్‌లో వున్నాను. నారిమన్ ముంబాయిలోనే వున్నాడు. ఆ సమయంలో బాబా ఏరుచ్‌తో నారిమన్‌కి ఫోన్‌లో చెప్పమని తన సందేశం ఇచ్చారు. ఏమనంటే, "సంతోషంగా ఉండు, దేని గురించి ఆలోచించకు. నువ్వు సంతోషంగా ఉంటే, బాబా కూడా సంతోషంగా ఉంటారు. 'నాకు అన్నీ తెలుసు. సమస్యలన్నీ సర్దుమణుగుతాయి. ప్రేమతో బాబా" అని ఫోన్‌లో ఏరుచ్ చేత చెప్పించారు.

**మరొకసారి, మండలి హాలులో, బాబా నారిమన్‌తో ఇలా అన్నారు, "నీకు నేను ఎల్లవేళలా** తోడు-నీడగా వుంటానని అభయమిచ్చారు. అంతేకాదు, 'బొంబాయిలో వున్న నా గొప్ప ప్రేమికులు అర్నవాజ్-నారిమన్‌లు అని అభినందించారు. 'నారిమన్ ఒక సాధువులాంటి వాడు. ఒక అత్యంత ప్రకాశవంతమైన రత్నంలాంటివాడు నారిమన్ అని బాబా కితాబి చ్చారు. నారిమన్‌తో సరితూగ గల వ్యక్తి ఈ ప్రపంచంలో మరొకరు లేరన్నారు బాబా.

**1973 అక్టోబర్‌లో నారిమన్ మలేరియా వ్యాధి బారినపడ్డాడు. ఆ పిదప తిరిగి కోలుకోవడం** చాలా కష్టమైంది. 1974, జూలై 2న ముంబాయిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ గుండెపోటుతో నారిమన్ బాబాలో ఐక్యమయ్యాడు.

**లౌకిక బాధ్యతలను నిర్వహిస్తూనే ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో బాబా ప్రేమికులకు** ఆచరణాత్మకంగా ప్రభోదించిన గొప్ప మనీషి నారిమన్ అని బాబా ప్రేమికులు ఆయన్ని అభిమానిస్తారు. ఆయన జీవితం నేటి యువతకు గొప్ప ఆదర్శం అని వారంటారు. నారిమన్ మరణం తర్వాత ఆర్నవాజ్ మెహెరాజాద్‌కు వచ్చి స్థిరపడింది.

**- ఆర్నవాజ్ గురించి ప్రక్క పేజీలలో**

# అర్నవాజ్

## 15.3.1918 - 18.2.2009



1920వ దశకంలో బాబావారి తొలి కార్యదర్శిగా పనిచేసిన ఫ్రంరోజ్ దాదా ఛాన్జీ సోదరుని కుమార్తె అర్నవాజ్. ఆర్నవాజ్ తండ్రి పేరు నౌరోజీ దాదా ఛాన్జీ. తల్లి బచ మాయి. వీరికి ముగ్గురు కుమార్తెలు. ఆర్నవాజ్, రోడా, నర్గీస్. ఇద్దరు కుమారులు. 1918 మార్చి 15న ఆర్నవాజ్ జన్మించింది. ఆర్నవాజ్ సోదరి రోడా మిస్త్రీకి ముగ్గురు మగ పిల్లలు. అందులో ఒకరు ఫలూ మిస్త్రీ. నేడు బాబా ట్రస్టు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన అవివాహితుడు.

**1929వ సంవత్సరంలో, ఒక రోజున నౌరోజీ దాదా ఛాన్జీ** తన ముగ్గురు కుమార్తెలతో బాబాని దర్శించు కున్నాడు. ఈ సందర్భంలో, అర్నవాజ్‌ని ఉద్దేశించి ఏం చదువుతున్నావ్ అని బాబా అడిగారు. ఆపై అంతగా కష్టపడి చదవాల్సిన పన్లేదని అన్నారు. దీంతో అందరూ ఆశ్చర్య పోయారు. అర్నవాజ్ చాలా తెలివైనది. బాగా చదువుతుంది కూడా అని తండ్రి నౌరోజీ ఏదో చెప్పబోతే, "నా మీద నమ్మకం లేదా?" అని బాబా ప్రశ్నించారు. అర్నవాజ్ చదువును ఒక సంవత్సరంపాటు ఆపేసి, ఆపై మళ్ళీ మొదలు పెట్టండన్నారు," బాబా. ఆ మాదిరిగా అర్నవాజ్‌ని ఆనాడే బాబా తన సేవకు సిద్ధం చేశారు.

**ఒకరోజున నారిమన్ రాసిన లేఖ అర్నవాజ్ చదువుతోంది. ఆ రోజుల్లో నారిమన్ లండన్‌లో** చదువుకుంటున్నాడు. ఆ పిదప అతను మరో రెండేళ్ళపాటు పైచదువుల కోసం జర్మనీ వెళ్ళాలని సిద్ధమౌతున్నాడు. నారిమన్‌కి స్కాలర్‌షిప్ కూడా లభించింది. ఐతే బాబా ఏమన్నారో తెలుసా! నారిమన్‌ని చదువు చాలించి ఇండియాకు తిరిగి వచ్చేయమని ఆదేశించారు. ఈ విషయంపై ఆర్నవాజ్‌ని నారిమన్‌కి ఒక లేఖ రాయమన్నారు. లేఖ అందుకున్న నారిమన్ చాలా బాధపడ్డాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే రెండవ ప్రపంచ యుద్ధ భేరీలు మోగాయి. ఆర్నవాజ్ - నారిమన్‌లకు అవతారుని ఆదేశం అప్పుడు బోధపడిందని బాబాతో తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ చెప్పారు.

# నారిమన్‌తో నిశ్చితార్థం

**1942 సెప్టెంబరు 10 తర్వాత కొంతకాలం బాబా లోనావాలాలో ఏకాంతవాసం వున్నారు.** ఇందుకు ముందుగా తన మండలి వారిని, అర్నవాజ్, నారిమన్‌లను కూడా లోనావాలాకు బాబా ఆహ్వానించారు. 1942 డిశెంబర్ 21న నారిమన్ – అర్నవాజ్‌ల వివాహ నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. ఇరువైపుల కుటుంబ పెద్దలు, మహిళా ప్రేమికులు సుమారు 30 మంది వరకూ హాజరయ్యారు. బాబా స్వయంగా నారిమన్ వేలికి, అలాగే అర్నవాజ్ వేలికి బంగారు ఉంగరాన్ని తొడిగారు. ప్రేమతో ఆశీర్వదించారు. వారు బాబా మెడలో పూలమాల వేసి, ప్రణమిల్లారు. రెండేళ్ళ తర్వాత ఒక సందర్భంలో బొంబాయి నుండి నారిమన్ – అర్నవాజ్‌లను పిలిపించారు. బాబా వారి వివాహం గురించి ప్రస్తావిస్తూ, 1944 డిసెంబరు నెలలో తప్పక మీ పెళ్ళి జరగాలి. ఆ నెలలో ఏ తేదీన అనేది మీ ఇష్టం అని బాబా సూచించారు. అందుకు అర్నవాజ్ నారిమన్‌లు డిసెంబరు 21వ తేదీని ఎంచుకున్నారు. అందుకు బాబా వెంటనే అంగీకరించారు.

**కాగా, 1944 డిసెంబర్ 9వ తేదీ సాయంత్రం, నారిమన్ – అర్నవాజ్‌లు సుమారు 80** మందికి పైగా బంధుమిత్రులతో బొంబాయి నుండి అహమ్మద్‌నగర్‌కు వచ్చారు. ఆ మర్నాడు వారందరికీ బాబా దర్శనం ఇచ్చారు. 1944 డిసెంబర్ 21వ తేదీ నాడు నారిమన్ (31) – అర్నవాజ్ (26)లకు అహమ్మద్‌నగర్‌లోని పార్శీయుల అగ్ని దేవాలయంలో వైభవంగా వివాహం జరిగింది. ఆ పిదప, ఆ రోజు సాయంత్రం నవ దంపతులు ఇద్దరూ పింపలగాం వెళ్ళి అవతారుడ్ని దర్శించుకున్నారు.

**బాబా బొంబాయికి ఎప్పుడు వెళ్ళినా నౌరోజీ దాదా ఛాన్జీ – బచ్ మాయిల ఇంట్లో బస** చేసేవారు. వారింట్లో బాబా కోసం ఒక ప్రత్యేక గదిని కేటాయించారు. బాబా బొంబాయిలో లేని సమయంలో కూడా బాబా గదిలో నూనె దీపం రాత్రిం పగళ్ళు వెలిగించేది బచా మాయి.

**ఐతే, 1939 తర్వాత బాబా బొంబాయికి వెళ్ళినా, బాబా నౌరోజీ వారింట బస చేయలేదు.** అర్నవాజ్ నిశ్చితార్థం తర్వాత, “బాబా మీరెప్పుడు బొంబాయి వస్తున్నారని” బచ్ మాయి బాబాని అడిగింది. నారిమన్ – ఆర్నవాజ్‌లు బొంబాయిలో ఇల్లు తీసుకున్నాక, వారింటికి వస్తానని బాబా బదులిచ్చారు.

**ఆ పిదప బాబా బొంబాయికి ఎప్పుడు వచ్చినా నారిమన్ – ఆర్నవాజ్‌ల ఇంటనే బాబా బస ఉండేది. వీరింటి పేరు ఆషియానా.**

## ఎవరు చెడ్డవారు? ఎవరు మంచివాళ్ళు?

**అది ఏ సంవత్సరమో గుర్తులేదు అంటూ ఆర్నవాజ్ ఇలా చెప్పింది. ఆ సమయంలో బాబా** ఆషియానాలో ఉన్నారు. చాలామంది పురుష బాబా ప్రేమికులు బాబా దర్శనార్థం వచ్చారు. నేను కూడా బాబా ఎదుట కూర్చున్నాను. బాబా వారందరినీ ఉద్దేశించి ఎవరు చెడ్డవారు? ఎవరు మంచివాళ్ళు? అనే విషయమై వారితో బాబా ఇలా అన్నారు.

**"ఒక ఊర్లో ఒక గజదొంగ వున్నాడు. చోరీలు చేయడం అతని నిత్యకృత్యం. అతడ్ని పట్టి** ఇచ్చిన వానికి పారితోషికం ప్రకటించింది ప్రభుత్వం. అలాంటివాడు ఒక రోజున చోరీకి వెళ్ళాడు. ఆ సమయంలో ఆ ఇంట్లో వున్న ఒక గర్భిణి స్త్రీ పురిటి నొప్పులతో బాధ పడుతోంది. చుట్టుప్రక్కల బంధువులు ఎవరూ లేరు. ఒంటరిగా వుంది. ఆ స్థితిలో ఆమెని చూసిన ఈ దొంగ అడుగు ముందుకు వేయలేక పోయాడు. తానక్కడ లేకుంటే ఆమె మరణిస్తుందని తెలిసి, ఆమె ప్రసవం పూర్తయ్యి, తిరిగి కోలుకునే వరకూ అతను అక్కడే ఉండిపోయాడు. ఆమెకు అవసరమైన ఆహారం, బట్టలు వంటివి ఎక్కడ్నుంచో తీసుకొచ్చి ఆమెకి అందజేశాడు. ఆమె స్థిమితపడ్డాక, దొంగ తన దారిన తాను వెళ్ళాడని చెబుతూ, మీరితడ్ని మంచి వాడంటారా? దుర్మార్గుడంటారా? ఏమని పిలుస్తారని బాబా ప్రశ్నించారు. మంచివాళ్ళు – చెడ్డవాళ్ళు అనేది ఏమీ లేదన్నారు బాబా. అందరూ మంచివాళ్ళేనన్నారు.

**కామం, క్రోధం, అత్యాశ దుర్మార్గమైనవి అన్నారు బాబా. ఈ మూడూ అత్యంత ప్రమాదకర మైనవని** బాబా హెచ్చరించారు. కాబట్టి, మీరు ఎవరినీ వారి మంచి – చెడులని బేరీజు వేసి న్యాయం చెప్పొద్దని హెచ్చరించారని, అర్నవాజ్ ఆనాటి మాటల్నితెలియజేసింది.

## అరుణాచలం

**ఆమె ఇంకా ఇలా చెప్పారు. ఆ సమయంలో బాబా మద్రాసులో వున్న సంపత్ అయ్యంగార్ ఇంట ఏర్పాటు** చేసిన కార్యక్రమానికి మండలి ప్రేమికులతో హాజరయ్యారు. మేం ముంబాయి నుండి చాలామందిమి ఈ కార్యక్రమానికి మద్రాసు వెళ్ళాం. మద్రాసులో బాబా కార్యక్రమం ముగిశాక, ఇంత దూరం వచ్చాం కదా అని, దగ్గర్లోనే ఉన్న అరుణాచలం వెళ్ళి వస్తామని బాబా అనుమతి కోరాం.

**బాబా ఏమన్నారో తెలుసాండి!. 'నేను బ్రతికున్నంత వరకూ నన్ను అంటిపెట్టుకుని ఉండండి.** మీరు ఎక్కడకు వెళ్ళాల్సిన పనిలేదని నిర్ద్వందంగా చెప్పారు. అందుకు కారణం బాబా స్పష్టంగా చెప్పలేదు".



**1948 మార్చి 14న బాబా పింపల్‌గాం నుండి ఆదీ సీనియర్‌తో కలిసి ముంబాయిలోని** ఆషియానాకి వచ్చారు. బాబా నవజీవనంలోకి వెళ్ళబోతున్న రోజులవి. నవజీవనంలో భాగంగా తన పేరిట ఉన్న మెహెరాజాద్ బంగళా తాళం చెవిని నారిమన్ చేతికి అప్పగించారు. ఐతే, మెహెరాజాద్ బాబాకే చెందినదని మేం భావించామని అర్నవాజ్ అన్నారు.

## మరమ్మత్తులకు రూ 7 వేలు

**1950వ దశకంలో బొంబాయికి బాబా ఎప్పుడు వచ్చినా ఆషియానాలోనే బాబావారి బస ఉండేదని** చెప్పుకున్నాం కదా! బాబా వచ్చేముందు ఏ తేదీన, ఏ సమయానికి వస్తున్నది ముందుగానే తెలియజేసేవారు. 1959వ సంవత్సరంలో, బాబా ఆషియానాకు వస్తున్నారని తెలియగానే, అర్నవాజ్ - నారిమన్‌లు తమ అపార్ట్‌మెంట్‌కు తగిన మరమ్మత్తులు చేపట్టారు. అపార్ట్‌మెంట్‌కి బాబాకిష్టమైన రంగులతో పెయింట్ చేయించారు. కొత్త కర్టెన్లు ఏర్పాటు చేశారు. బాబా పడుకునే గదికి ఎయిర్ కండిషనర్ ఏర్పాటు చేశారు. ఈ పనులన్నింటినీ చకచకా పూర్తిచేశారు. ఈ పనులు పూర్తయ్యాక ఒకరోజున బాబా వచ్చారు. ఈ పనులు చూసి బాబా సంతోషించారు. ఎంత ఖర్చు అయ్యిందని అడిగారు. 'ఏడు వేల రూపాయలు,' అని నారిమన్ జవాబిచ్చాడు. నా కోసం ఇంత పెద్ద మొత్తం ఖర్చు చేశారా? అన్నారు బాబా. మీ రాక మాకు చాలా అనందం బాబా అన్నది, అర్నవాజ్. అపార్ట్‌మెంట్‌లోని అన్ని గదులూ కలియ తిరిగి, చివరిగా డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చున్నారు బాబా. తనకు బాగా దప్పికగా ఉంది. త్రాగడానికి సోడా కావాలన్నారు.

**ఆ రోజుల్లో బాబా ఎక్కువగా సోడా తీసుకుంటున్నారు. అర్నవాజ్ నిరుత్తరురాలయ్యింది.** ఎందుకంటే, బాబా వస్తున్నారని, ఎన్నో ఏర్పాట్లు చేసింది, కానీ బాబా అడుగుతారని తెలిసి కూడా సోడా తెప్పించడం మరచిపోయింది. జ్ఞాపకం రాగానే, తన తమ్ముడ్ని సోడా తీసుకురావడం కోసం మార్కెట్‌కి పంపింది. కానీ ఇంతలోనే బాబా అషియానాకు వచ్చేశారు. సోడా కోసం వెళ్ళిన తమ్ముడు తిరిగి రాలేదు. ఈలోగా బాబా తనక్కావల్సిన దాహం అడగనే అడిగారు. అర్నవాజ్‌కి దిక్కు తోచలేదు. అవమానంతో తలదించుకుంది. బాబా సోడా గురించి రెట్టించి అడగ్గానే, తన తప్పిదాన్ని క్షమించమని, జరిగిన పొరపాటు బాబాకు ఉన్నదిఉన్నట్లు చెప్పింది.

**బాబా నవ్వుతూ, అషియానా రిపేర్ల కోసం ఏడువేల రూపాయలు ఖర్చు చేశారు. నాక్కావల్సిన** రెండు అణాల సోడా కొనడం మరచి పోయావన్నారు. బాబా కోసం అతి చిన్న విషయాల్లో కూడా మరింత శ్రద్ధగా వుండాలన్న గుణపాఠం నేర్చుకున్నానన్నది ఆర్నవాజ్.

**ఆ తర్వాత బాబా అర్నవాజ్‌తో మాట్లాడుతూ, ఆషియానాకు రావడం ఇదే చివరిసారి. ఇకపై** రావడం సాధ్యమవదన్నారు. ఇకపై బొంబాయికి రావడం కూడా కుదరదన్నారు. ఐతే, ఈ విషయం బాబా నారిమన్‌కి చెప్పలేదు. ఆ మర్నాడు అర్నవాజ్ పుట్టినరోజు. ఆ రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక బాబా తన మండలితో కలిసి మెహెరాజాద్‌కి బయల్దేరారు. "తిరిగి త్వరలో బొంబాయికి రమ్మనమని" నారిమన్ బాబాతో అన్నాడు. బాబా అతడిని తదేకంగా చూసి, ప్రేమగా ఆలింగనమిచ్చారు. 1960 ఫిబ్రవరి 25న బాబావారి 66వ పుట్టినరోజు. 1956 మోడల్ నీలి రంగు డిసోటో కారుని నారిమన్ దంపతులు బాబాకు పుట్టినరోజు కానుకగా బహుకరించారు. ఆ కారుకి అయ్యే నిర్వహణ ఖర్చు కూడా తామే భరిస్తామన్నారు నారిమన్. అప్పటి వరకూ బాబా అంబాసిడర్ కారుని వాడుతున్నారు.

## నీవు – నాకు తల్లివి

**నారిమన్ అర్నవాజ్‌లకు పిల్లలు లేరు. ఈ విషయమై అర్నవాజ్ ఇలా చెప్పింది. "ఒకరోజున బాబా చప్పట్లు కొట్టి నన్ను పిలిచారు.**
**నీవు నాకు తల్లివి. మెహెరాకు కూడా నీవే తల్లివి అన్నారు బాబా.**
**ఆ క్షణంలో బాబా మాటలు నాకు అర్థం కాలేదు.**
**తల్లితండ్రులకు పిల్లలే కదా తమ సర్వస్వం!**
**బాబావారి ఈ మాటలు చాలా రోజుల తర్వాత నాకర్థమయ్యాయని అర్నవాజ్ తన స్వగతం 'గిఫ్ట్ ఆఫ్ గాడ్' గ్రంథంలో పే. 213లో పేర్కొనింది.**

**1969 జనవరి 31న బాబా దేహత్యాగం తర్వాత నారిమన్ –అర్నవాజ్‌లు మెహెరాజాద్‌లో** స్థిరపడ్డారు. నారిమన్ 1974 జూలై 25న బాబాలో ఐక్యమయ్యాడు. అర్నవాజ్ 2009 ఫిబ్రవరి 18న మెహెరాజాద్‌లో 90 సంవత్సరాల వయస్సులో తీవ్ర గుండెపోటుతో బాబాలో ఐక్యమయ్యింది.

**అర్నవాజ్ సమాధి మెహెరాజాద్‌లో వుంది. నారిమన్ సమాధి దిగువ మెహెరాబాద్‌లోని** పురుష మండలి వరుసలో వుంది. తమ జీవితాంతం అవతారుని ప్రేమ – సేవకు అంకితమైన ఈ దంపతులు ఈ తరం వారందరికీ స్ఫూర్తిప్రదాతలు.

****

చరిత్రకు సజీవ సాక్ష్యం

# ముఖ చిత్ర కథనం


1935లో బాబా సమాధికి ఎదురుగా ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ – గేట్

ఈ నెల మాస పత్రిక ముఖ చిత్రం (కవర్ పేజి)ని నిశితంగా గమనించగలరు. ఈ చిత్రం ప్రచురించడానికి ఒక ప్రత్యేక కారణం వుంది. అదేమంటే, బాబావారి ఏకాంతవాసం కోసం బాబా సమాధికి ప్రక్కన "బాబా గది" 1935లో నిర్మించారు. ఆ దరిమిలా, 1936 ప్రాంతంలో బాబావారి సమాధికి మూడు వైపులా, అలాగే ఉత్తరాన వున్న మెహెర్ రిట్రీట్ వైపు వరకూ గట్టి ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే ఫెన్సింగ్ లోపల గోరింటాకు మొక్కలు (హెన్నా హెడ్జ్) నాటారు. దక్షిణ దిక్కులో, బాబా సమాధికి ఎదురుగా **"పెద్ద గేట్"**ని ఒక ప్రవేశ ద్వారంగా ఏర్పాటు చేశారు. ఇదంతా బాబా సమాధి ప్రాంగణం లోనికి నేరుగా ఎవరూ రాకుండా నిషేదించేందుకు చేసిన ఏర్పాటుగా చారిత్రక ఆధారాలు వున్నాయి. (https://avatarmeherbabatrust.org/osg-47).

ఈ ప్రవేశ ద్వారానికి సంబంధించిన పై చిత్రాన్ని చూడొచ్చు. బాబావారి ట్రస్టు వెబ్‌సైట్‌లో ఈ చిత్రాలు వున్నాయి. ఈ నిర్మాణాలు 1940వ దశకం చివరి వరకూ వున్నాయని, ఆ దరిమిలా, క్రమేపి తొలగించినట్లు తెలుస్తోంది.




## ప్రవేశ ద్వారం - అవశేషం

ఐతే, నేడు బాబావారి సమాధికి ఎదురుగా, ఈ చెక్క గేట్‌కి సంబంధించి **"ఒక అవశేషం"** మాత్రం ధృఢంగా కనిపిస్తోంది. **ఇది తెలియజేయడానికే ఈ ఉపోద్ఘాతం.** ఇటీవల, 2026 ఏప్రిల్ రెండవ వారంలో, మేం మెహెరాబాద్‌లో వున్న సమయంలో ఈ ధృఢమైన కొయ్యకి మెహెరీశంలో ఎంతో ప్రాముఖ్యత వుందని, అదేదో తెలుసుకో వల్సిందని శ్రీ మల్లాది రామారావ్ మాకు సూచించారు. అలా **తీగ లాగితే,** ఆనాటి చారిత్రక సమాచారం ఈ విధంగా తేటతెల్లమైంది. ట్రస్టీ శ్రీ **రమేష్ జంగ్లేతో ఈ విషయమై మాటామంతీగా అడిగితే, బాబా సమాధికి ఎదురుగా** వున్న బోగన్‌విల్లా చెట్టు కేసి చూడమన్నారు. ఆ చెట్టు చుట్టూతా వున్న ఇనుప గ్రిల్‌ని, ఆ గ్రిల్ లోపల వున్న సుమారు ఐదున్నర అడుగులు నిలువుగా వున్న **నల్లని దేవదారు కర్రని** చూడమన్నారు. ఈ కర్రకు తలుపులకు వాడిన హింజెస్ కూడా నేటికి కనిపిస్తున్నాయి. ఈ కర్ర పడి పోకుండా ఒక సపోర్ట్‌గా మరో ఆధారం వుంది.

**ఇదే ఆనాటి ప్రవేశ ద్వారానికి సంబంధించిన అవశేషం, అని శ్రీ రమేష్ అన్నారు. భవిష్యత్తరాల వారికి ఈ చారిత్రక ఆధారాన్ని తెలియజేసేందుకై గట్టి ఇనుప గ్రిల్ ఏర్పాటు చేశారన్నారు. ఈ ఇనుప గ్రిల్ బోగన్‌విల్లా కోసం కాదని చెప్పకనే చెప్పారు శ్రీ రమేష్.**

## ప్రార్థనా సమయంలో

**సమాధికి ఎదురుగా బాబా ప్రార్థనల జరిగే సమయంలో గమనించండి. కొంతమంది,** ఆ ఇనుప గ్రిల్‌ని ఆలంబనగా ఆనుకుని నిటారుగా నిల్చుంటారు. ఈ గ్రిల్ ఏర్పాటు లేకపోతే, ఈ చారిత్రక అవశేషమే వారికి ఆధారమయ్యుండేదని, పకపకా నవ్వుతూ అన్నారు జంగ్లే.

**ఆసక్తిగల చారిత్రకాభిలాషులు ఈ దఫా మెహెరాబాద్‌కి వెళ్ళినప్పుడు,**
**ఈ ప్రవేశ ద్వార అవశేషాన్ని తిలకించగలరు.**
**వీలైతే, మీ స్పందన 9959553218 తెలియజేయగలరు.**

*




### ఉడతారా సంఘటన

# స్మారక స్థూప స్థాపన

**1956 డిసెంబరు 2న మెహెర్‌బాబా** ప్రయాణిస్తున్న కారుకి ఉడతారా గ్రామ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగి నేటికి ఏడు దశాబ్దాలు నిండుతున్నాయి. పూణే నుండి 48వ నంబరు జాతీయ రహదారిలో సతారా పట్టణానికి సుమారు 12 కిమీ ముందుగానే ఉడతారా గ్రామం ఉంది. ఇది ముంబై – చెన్నై మహా నగరాల ను కలుపుతున్న అత్యంత రద్దీగా వుండే ఆరులైన్ల జాతీయ రహదారి. వాస్తవానికి, ఉడతారా సంఘటన స్థలాన్ని స్థానికుల సహాయం లేకుండా గుర్తుపట్టడం అసాధ్యం అనొచ్చు. ఐతే, నేటితో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చిక్కిందని, డాక్టర్ వాసుదేవ్ అన్నారు.

## దీపస్థంభం

ఉడతారా ప్రమాద సంఘటన జరిగిన ప్రాంతంలో, 2026 ఏప్రిల్ రెండవ వారంలో 'ఆరు అడుగుల ఎత్తైన స్మారక స్థూపాన్ని' భారత ప్రభుత్వ ఆధీనంలోని జాతీయ రహదారుల సంస్థ ఏర్పాటు చేసింది. **ఈ స్థూపంపై అవతార్ మెహెర్‌బాబాకు కారు ప్రమాదం జరిగిన సంవత్సరం, తేది, సమయం స్పష్టంగా తెలియజేశారు.** ఈ స్థూపం ఎత్తు తొమ్మిది అడుగులు వుండగా, భూమి లోపల మూడు అడుగులు, భూమి పైనుండి ఆరు అడుగుల ఎత్తు వుండేలా ఏర్పాటు చేశారు. అలాగే ఈ స్థూపం వెడల్పు సుమారు 6.3 అడుగులు వుంది. ఈ స్థూపం చుట్టూతా అందమైన గార్డెన్ చేపట్టనున్నామన్నారు. నేడు ఈ స్థూపం **ఒక దీప స్థంభంగా** బాబా ప్రేమికులకు సహాయపడుతుందనడంలో సందేహం లేదు. జాతీయ రహదారులపై ఎటువంటి సైన్‌బోర్డు ప్రభుత్వం అనుమతించదు. ఐతే, అవతారుని కృప వుంటే 'అసాధ్యం అనుకున్నవి కూడా

సుసాధ్యం' అవుతాయనడానికి ఇదొక చిన్న దృష్టాంతమని, ఈ విషయమై గత కొన్ని సంవత్సరాలుగా అలుపెరగక కృషి చేస్తున్న డాక్టర్ వాసుదేవ్ అన్నారు.

## అవతార్ మెహెర్‌బాబా స్పిరిట్యుయల్ కేంద్రం –ఉడతారా

ఈ ప్రమాద సంఘటన స్థలం సమీపంలోనే సుమారు 3 ఎకరాల భూమిని సుమారు రెండేళ్ళ క్రితమే కొనుగోలు చేసి 'అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు, అహల్యానగర్ పేరిట' రిజిష్టర్ చేశారు. ఈ స్థలంలో **'అవతార్ మెహెర్‌బాబా స్పిరిట్యుయల్ కేంద్రం - ఉడతారా' పేరిట స్థానిక బాబా కేంద్రం నొకదాన్ని** ఏర్పాటు చేయాలన్నది మా లక్ష్యం అన్నారు డాక్టర్ వాసుదేవ్. ఇందుకోసం పలువురు పేరెన్నికగన్న ఆర్కిటెక్ట్‌లను సంప్రదించామని, వారిచ్చిన పలు డిజైన్‌లు పరిశీలనలో వున్నాయన్నారు. ఈ భవనాల డిజైన్‌లు ఖరారు అయ్యేలోగా తాత్కాలిక ప్రాతిపదికన యాత్రీకులకు తగిన వసతి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు.

**ఈ ఏడాది డిసెంబర్ మాసంలోగా ఇక్కడి నల్లరేగడి భూమిలో 40 అడుగుల పొడవు, 8** అడుగుల వెడల్పు గల నాలుగు కంటైనర్‌లను, ఆధునిక కనీస సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామన్నారు. అలాగే, కేర్ టేకర్ నియామకం, యాత్రీకులకు భోజన, వసతి సౌకర్యం, అవతారుని పాదస్పర్శతో పునీతమైన సతారా, పంచగని, మహాబళేశ్వర్‌లకు సందర్శించాలనుకునే వారికి వీలుగా ఇక్కడ నుండి తగిన రవాణా సౌకర్యం ఏర్పాటు ఇతరత్రా మా ప్రతిపాదనలో వున్నాయన్నారు డాక్టర్ వాసుదేవ్. **ఈ ప్రాంగణంలో ప్రతినిత్యం బాబా నామస్మరణ జరగాలన్నదిమా ఆశయం అన్నారు వాసుదేవ్.**

**కాగా, బాబావారికి జరిగిన రెండు ఘోర కారు ప్రమాదాలలో మొదటిసారిగా 1952 మే 24న అమెరికాలోని ఓక్లహోమా దగ్గర** జరిగింది. ఈ సంఘటన జరిగి నేటికి 74 సంవత్సరాలు నిండాయి. ఈ సందర్భంగా మే 24న సా. 4 నుండి 9 వరకూ ఉడతారా స్మారక ప్రాంగణంలో బాబా ప్రార్థనలు, ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విశ్వానికి ఒక వరం - బాబాకు శాపం

**ఈ కారు ప్రమాదాలకు సంబంధించి బాబా ఇలా అన్నారు. ఈ ప్రమాదం విశ్వానికి ఒక వరం.** బాబాకు శాపం. భగవంతుడు మనిషికి తెలియకుండా బాధపడతాడు. భగవంతుడు తెలిసి యావత్తు మానవాళి కోసం బాధపడతాడు. ప్రపంచ మానవాళి అందరి కోసం అవతారుడు అనేక బాధలు అనుభవిస్తాడన్నారు బాబా!.

**ఉడతారాలోని ఈ పవిత్ర ప్రాంగణాన్ని సందర్శించాలనుకునే వారందరికీ స్థానిక బాబా ప్రేమికులు స్వాగతం పలుకుతున్నారు. జాతీయ రహదారిపై స్మారక స్థూప ఏర్పాటుకు సంబంధించిన మరికొన్ని చిత్రాలను పేజి 39లో చూడగలరు.**



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**
**ఆంగ్ల మూలం :- భావూ కల్చూరీ**
**లార్డ్ మెహెర్, 1925 నుండి**
**తెలుగుసేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్**

**(గత సంచిక తరువాయి)**

## షెరియార్జీ మరణం

**1932 ఏప్రిల్ 30 రాత్రి బాబావారు పెద్ద ఆదీని పిలిచారు. హఠాత్తుగా వచ్చింది ఆ పిలుపు.** సమయం అర్ధరాత్రి. పాఠకులకి తెలుసుగా, రాత్రి కాపలా వున్న వాళ్ళని పిలవాలంటే బాబావారు చప్పట్లు కొడతారు. ఆ నిశీధి వేళ చప్పట్లు వింటూనే పెద్ద ఆదీ బాబావారి దగ్గరకు వచ్చాడు. ప్రభువు ఏదో సంజ్ఞలు చేస్తున్నారు. శ్రద్ధగా గమనించాడు. తమ గెడ్డం చూపించారు మౌన మూర్తి. రెండు చేతులు పైకి ఎత్తారు. బుర్రకి పని చెప్పాడు పెద్ద ఆదీ. కానీ ప్రభువు ఆంతర్యం అర్థం కాలేదు. ఈ మాట అతని మొహం చూస్తూనే కనిపిస్తోంది. మెహరీశుడు వో నిటూర్పు విడిచారు. ఇహ వెళ్ళు అన్నారు అతగాడిని. ఖిన్నుడై వెనుతిరిగాడు పెద్ద ఆదీ. ఇప్పుడు ఐదురోజుల తర్వాత ట్యూబ్‌లైట్ వెలిగింది. సర్వాంతర్యామికి తండ్రి మరణవార్త వెంటనే తెలిసిందన్నమాట. నాకు చెప్పబోయారు కానీ నా బుర్రకి ఎక్కలేదు, పొరపాటైంది బాబా అని మధనపడ్డాడు పెద్ద ఆదీ.

**బాబావారు తమ్ముళ్ళు యిద్దరినీ పిలిచారు. వెంటనే చిన్న ఆదీ, బెహ్రాం వచ్చారు. తండ్రి** మరణ వార్త చెప్పారు. ఓదార్చారు. ప్రతి ప్రాణికీ మరణం తప్పదు. నిద్రవంటిది చావు అన్నారు. నిద్రకీ చావుకీ వొక్కటే తేడా. నిద్ర నుంచి మెళుకువ వస్తే, మార్పు వుండదు శరీరంలో. నిద్రపోయే ముందు ఎలా వున్నారో అలానే వుంటాడు మనిషి లేచాక. మరి, మరణించాక అలాకాదు, పరిసరాలు మారుతాయి. శరీరం మారుతుంది. అంటే ఏమిటి? మరణం తర్వాత మరో శరీరంతో నిద్రవేస్తాడు మనిషి. చావు, పుట్టకలు రెండూ స్వప్నాలే. కలవంటి చావు గురించి కొట్టుకుపోతారా ఎవరైనా? అలానే పుట్టకతో సంతోషిస్తారా ఎవరైనా అని అంటూ బాబావారు తమ్ముళ్లకి ధైర్యం నూరిపోశారు.

**అందరివంటి వాడు కాదు బోబో. ఎంతో అదృష్టవంతుడు. అందుకనే నిద్రవంటిది కాదు** చావు నాన్న విషయంలో. నాన్న మేలుకొనే వుంటాడు ఎప్పటికీ అన్నారు. తమ మాట తముళ్ళకి అర్థమయినట్లు లేదనిపించింది మరింత వివరంగా చెప్పారు. ఏమని? జనన



Meher Baba's father, Sheriar Mundegar Irani;
this was one of Baba's favorite photographs of his father.

మరణాలకి అతీతుడయ్యాడు. ముక్తి లభించింది నాన్నకి అన్నారు. తల్లికి టెలిగ్రాం పంపారు. “బాధపడకు అమ్మా! నాన్న నా దగ్గరే వున్నారు”, నీ ఆరోగ్యం జాగ్రత్త! చిన్న ఆదీని పంపమంటావా? నీకు తోడు వుంటాడు. ఏ సంగతి వెంటనే తెలియజేయి – ఇదీ బాబావారి టెలిగ్రామ్ తల్లికి. ఆమె దగ్గర మణి వొక్కత్తే వుందప్పుడు. జాల్ చైనాలో వున్నాడు. అందుకనే చిన్న ఆదీని పంప మంటావా తోడుగా వుంటాడు అన్నది.

## ఖుదా రషీదా ఫర్జాన్

**అప్రస్తుతంకాని మరో అంశం. షెరియార్జీ మరణ సమయంలో దగ్గర వున్నది, బంధు మిత్రులు.** షిరీన్‌మాయి, మణి పూనేలో వున్నారు. ‘నాకేం ఫరవాలేదు. మెరుగవుతోంది నా ఆరోగ్యం. ఎన్ని రోజులుంటారు ఆస్పత్రిలో నా దగ్గర. ఇంటికి వెళ్ళండి, అని షెరియార్జీ అనటంతో, తల్లి, కూతురు తిరుగు దారిపట్టారు. వాళ్ళు అటు పూనా వెళ్ళేరో లేదో ఇటు షెరియార్జీ స్వర్గవాసి అయ్యారు. అంత్యక్రియలు బొంబాయిలోనే చేశారు. పార్శీలు అందరి మాదిరిగా షెరియార్జీ చివరి యాత్ర పరిసమాప్తమైంది శాంతిస్థూపం దగ్గర. పాఠకులకి గుర్తుంది కదా, షెరియార్జీ ఇండియాకి వస్తున్నప్పుడు అశరీర వాణి విన్నాడు. నువ్వు వెదుకుతున్న దేముడు నీకే పుడ్తాడు అని చెప్పింది అశరీర వాణి. ఆ దేముడు మెహెరుడు అని షెరియార్జీకి తెలుసు. అందుకనే కొడుకుని ఖుదా రషీదా అని పిలిచేవాడు. ఖుధా అంటే భగవంతుడు. రషీదా అంటే భగవంతుని చేరినవాడు. కొడుక్కి వుత్తరం ఎప్పుడు వ్రాసినా, ఈ సంగతి మరింత స్పష్టం చేసేవాడు. “ఖుదా రషీదా ఫర్జాన్”, అని వ్రాశాక ఉత్తరం మొదలు పెట్టేవాడు. తాను సాధించలేనిది తన కొడుకు సాధించాడన్న గర్వం తొణికిసలాడేది ఆయన మాటల్లో. చిన్నప్పటి నుంచి నా జీవిత గమ్యం వొక్కటే – భగవత్ సాక్షాత్కారం కోసం కలవరించాను. అశరీరవాణి మాట విని పెళ్లి చేసుకొన్నా. మానసికంగా నేనొక ఫకీరుని అనేవాడు. భగవదనుభూతి నానొసట వ్రాసి పెట్టలేదు ఈ జన్మలో. ఏంచేస్తాను. అయినా నాకేమి దిగులు లేదు. విత్తనం నేను వేశాను. చెట్టు పెరిగి పెద్దది అయింది. పళ్ళు కాశాయి. నా కొడుక్కి దొరికిందా పండు. నాకు యింతకంటే

యింకేమి కావాలి. మేర్వాన్ పేరు చెప్పి నా కోరిక తీరింది. మాటల్లో చెప్పలేను నా ఆనందం. నా ఖుదా రషీదా ఫర్జాన్ చేతుల్లోనే దొరుకుతుంది ముక్తి నాకూ. మేర్వాన్ తల్లిదండ్రులుగా, నేను, షిరీన్ అదృష్టవంతులం. భగవదైక్యం లభిస్తుంది మా ముద్దు బిడ్డ పేరు చెప్పి. జీవితగమ్యం తెలుసుగా – భగవదైక్యం. నా ఖుదా రషీదా ఫర్జాన్ ప్రసాదిస్తాడు మాకు, ఆ వరం అనేవాడు తరుచు. బాబావారి చిన్నప్పటి నేస్తం బైలీతో ఈ మాటే అనేవాడుట. నాకేమి కావాలి రా. మృత్యుదేవత పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను. చావుతో అనంత శాంతి లభిస్తుంది. ఆ సుమధుర ఘడియల కోసం ఎదురుచూస్తున్నా ననేవాడుట. షెరియార్జీ చివరి రోజుల్లో బైలీ ఆయన వెంట నడిచాడు. బాబావారి ఆదేశం మేరకు షిరీన్ మాతకి చేదోడు వాదోడుగా వున్నాడు. పూనాలో సరైన వైద్య సదుపాయం లేదు, బొంబాయికి తీసుకుపోదాం, షెరియార్జీని అంటే, ఏర్పాట్లు చేసిన వాడు బైలీ గారే. ఇంటి దగ్గర నుంచి స్టేషన్‌కి తీసుకువచ్చాడు. రైలు ఎక్కించాడు. బొంబాయిలో దింపి ఆస్పత్రిలో చేర్పించాడు.

## షెరియార్జీ ఆఖరి క్షణాలలో...

**షెరియార్జీని రెండు చేతుల్తో ఎత్తుకొని వెళ్ళాను. ఇంటి దగ్గర నుంచి కారులోకి, రైల్లోకి అని చెప్పాడు, బైలీ వో సారి గతావలోకనం చేస్తూ. అమ్మకి నమ్మకం లేదు పూనా డాక్టర్లపైన. బొంబాయి తీసుకువెడదాం. మంచి డాక్టర్లున్నారు** అక్కడ అంది అమ్మ. అందుకనే చివరి రోజుల్లో షెరయార్జీని బొంబాయి తీసుకు వెళ్ళింది", అన్నాడు. "మేడ మీద గదిలో షెరియార్జీ వుంటున్నారు. ఆయన్ని జాగ్రత్తగా క్రిందకు తీసుకువచ్చాను. నమ్ము నమ్మకపో. ఆయన్ని రెండు చేతుల్తో ఎత్తుకొని మెట్లు దిగుతుంటే. అసలు కష్టం అనిపించలేదు. అంత భారీకాయం మనిషి, పువ్వులా వొదిగి పోయారు నా చేతుల్లో. మెట్లకి దగ్గరగా కారు వుంది. ఆయన్ని కారులో పడుకోబెట్టాను వెనుక సీటులో. స్టేషన్‌కి వెళ్ళాక, స్ట్రెచర్ తెచ్చారు. షెరియార్జీని చాలా జాగ్రత్తగా స్ట్రెచర్‌పై పడుకోబెట్టాను. కూలీలు స్ట్రెచర్‌ని రైలు పెట్టెలోకి తీసుకు వచ్చారు. బెర్త్‌పై పరుపు పరిచాను. షెరియార్జీని ప్రక్కమీద పడుకోబెట్టాను, అని బాబా నేస్తం చెప్తుంటే శ్రోతల కళ్ళు చెమర్చాయి. **రైలు ఎక్కాక షెరియార్జీ ఏమన్నారో తెలుసా అని బైలి అడుగుతుంటే, ఏమన్నారు అని** ఏకకంఠంతో అడిగారు అతని శ్రోతలు. "నిన్ను కష్టపెట్టానురా. క్షమించరా అన్నారు పెద్దాయన. అలా అనకయ్యా అని నేను అంటుంటే నా మాటకొట్టేశారు. నా చెతుల్ని తన చేతుల్లోకి తీసుకొని థాంక్సు చెప్పారు. నిన్ను చూడలేనేమో మళ్ళీ. నాకు నమ్మకం లేదు. ఇదే కడసారి చూపేమో? అని అంటుంటే షెరియార్జీ మాటలకి అడ్డుపడ్డాను. అలా అనకు పెద్దాయన అన్నాను. నా మాటల్ని పట్టించుకోలేదు సరికదా అన్నారు కదా – ఇదిగో యిప్పుడు

బొంబాయి ఆస్పత్రిలో చేరుతున్నది ఎందుకంటావ్. మృత్యు దేవతకి లొంగి పోవడానికే అన్నారు. నా కన్నీళ్ళు ఆగలేదు. అలా అనకు పెద్దాయన అంటుంటే నా మాటల్ని కొట్టిపారేశాడు. ఈ ఆఖరి క్షణాల్లో బాబాని గుర్తుచేసుకున్నానని చెప్పు నీ నేస్తానికి అన్నారు. ఇంకోమాట గుర్తంచుకో అన్నారు. ఏమి చెప్తారో అని ఆత్రంగా చూశాను ఆయన కేసి. మేర్వాన్ అంటే నాకు నాకు వల్లమాలిన అభిమానం. ఇది పుత్రవాత్సల్యం కాదు. నా మేర్వాన్ ఎవరో తెలుసుగా? ఖుదా రషీద్ ఫర్జాన్. నా నమ సుమాంజలి అర్పించు. బాబా అంటే ఎంతో ప్రేమ అని చెప్పు. బాబాని అంటి పెట్టుకొని వుండు ఎప్పటికీ. భక్తిప్రపత్తులతో వుండు. మేర్వాన్ వొక్కడే సాయపడగలడు నీకు. నా ముద్దుల బిడ్డ వల్ల నీకు మేలు జరుగుతుంది అన్నారు. నన్ను ఆశీర్వదించారు. ఇదే కడసారి చూపేమో అన్నారు. అదే జరిగింది అని బైలీ అంటుంటే శ్రోతలకి ధర్మ సందేహం వచ్చింది. మెహెరుని అంటిపెట్టుకోమని ఆ పెద్దాయన అంత స్పష్టంగా చెప్పాడు కదా. ఆ పని చేశావా మహానుభావా? అనుకొన్నారు. మెహెరీశుని బైలీ వదిలిపెట్టాడు. కె.జె. దస్తూర్ లాగ అనలేము కానీ, జరిగింది ఏమంటే బాబావారే ఇతగాడిని దూరం పంపేశారు. ఈవైనం ముమ్ముందు తెలుస్తుంది. ప్రస్తుతాంశం – షెరియార్జీ చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిన మహా మనిషి. అవతారుని తండ్రిగా ధన్యుడాయన.

**మే 5వ తేదీన బాబావారు శిష్యులతో విహార యాత్రకి వెళ్ళారు. ఈసారి వారు వెళ్లిన వూరి** పేరు కొడెమారియా. కొండల మధ్య వున్న ఆ వూరు చూడదగినది అని అంటే వెళ్ళారు. అక్కడి ప్రకృతి సౌందర్యం – అద్భుతహా అనిపించింది. విన్న దానికంటే ఎక్కువగా వున్నదీ వూరి అందచందాలు. లుగానోకి దగ్గరే. ప్రొద్దుటే వెళ్ళారు. చీకటి పడుతుంటే తిరిగి వచ్చారు. అంతసేపు అక్కడ ఏమి చేశాడయ్యా అంటే కాసేపు కలివిడిగా వూరు చుట్టి వచ్చారు. పచ్చికబయళ్ళపై కూర్చుని సేదతీరారు. సాయంత్రం అవుతుంటే కాసేపు ఆ ఆట – ఈ ఆట ఆడారు.

**లుగానోకి తిరిగి వస్తూనే బాబావారు తమ గదికి వెళ్ళారు. కొంచెం తమకి బాగాలేదన్నారు.** వాంతి వచ్చేట్లుందన్నారు. ప్రొద్దుట విరోచనం కాలేదు. బహుశా అందుకనేనేమో కడుపు నెప్పిగా వుంది అన్నారు. మీరందరూ భోజనం చేయండి. నేను ఏదో నాలుగు మెతుకులు తింటానన్నారు. తమ ప్రభువుకి కడుపు నెప్పి వస్తే తమకే వచ్చినట్లు బాధపడ్డారు పెద్ద ఆదీ, కాకా. భోజనం చేస్తూనే బజారుకెళ్ళి హోమియోపతి మందు తెచ్చారు. అదొక ద్రావకం. వో చెమ్చాడు తీసుకోండి బాబా, కడుపు నెప్పి తగ్గుతుంది అన్నారు. ప్రభువు సరేనన్నారు. ఆ మందు తీసుకొన్నారు. కాసేపటికి కొంచెం నెప్పి తగ్గింది. ఇహ నడుం వాలుస్తానన్నారు. పాఠకులకి తెలుసుగా మెహెరీశుడు ఎక్కడ ఎప్పుడు విశ్రాంతి

తీసుకొంటున్నా, కించిత్ చప్పుడు చేయకూడదు ఎవరూ. రాత్రిపూట బాబా గారి గది బయట ఎవరో వొకరు కాపలా కూర్చోవాలి. ఇది ఇప్పటి అలవాటా? కాస్బాపేట రోజుల నుంచీ ఇంతే. ప్రభువు నిద్రకి ఏమాత్రం భంగం కలగకూడదు. మెహెరుడు నిద్రపోతాడు మనందరిలా అని కాదు ఆరు – ఏడు భూమికల మధ్య విశ్రాంతి తీసుకొంటాను, అదే నా నిద్ర అని మెహెరీశుడు శెలవిచ్చారో తూరి. రాత్రి కాపలా పని బైలీ, అర్జున్ మాస గార్లు శ్రద్ధగా చేసేవారు, అప్పట్లో అంటే ఇండియాలో వున్నప్పుడు. ఇప్పుడు ఈ విదేశీ **యాత్రలో కాపలా బాధ్యత కాకా బారియాపై పడింది. కాసేపు పాటలు వింటా నన్నారు బాబా.** గ్రామ ఫోన్‌ను పెట్టండి అన్నారు. శిష్యులు అందరికీ పిలుపు వెళ్ళింది. వాళ్ళందరూ వచ్చారు బాబావారి గదికి. ఎప్పటిలా వొదిగి వొదిగి కూర్చొన్నారు. ఆధ్యాత్మిక కీర్తనల రికార్డులు వేశారు. ఇంగ్లీషులో కూడా ఎన్నో ఆధ్యాత్మిక పాటలున్నాయి. పాల్ రోబెసన్ వంటి వారు పాడారు ఆ పాటల్ని. ఇంగ్లీషు పాటలు కొన్ని, హింది, మరాఠి కీర్తనల రికార్డులు కొన్ని వేశారు. ఈ సంగీత ఝరికి తగ్గట్టుగా పెద్ద ఆదీ హార్మోనీపై రాగాలు పలికించాడు. బెహ్రాం సితారపై మధుర గానం వినిపించాడు. బాబావారు పాటలు వింటు న్నారన్నమాటే కానీ ఆయన చూపు మరెక్కడో వున్నట్లుంది. అలా అని పాటలు విని ఆనందించటం లేదనలేం. ఏది ఏమయితేనేం, పాశ్చాత్య శిష్యుల ధర్మసందేహం తీర్చారు.

## బాబా రాత్రిళ్ళు పడుకొంటారా?

**ఇంతకీ ఆ ధర్మసందేహం ఏమిటి అంటారా చెప్తాను వినండి. మెహెర్‌బాబా రాత్రి పడు కొంటారా,** ఏదో కాస్తంత కునుకుతీసి లేచి కూర్చుంటారా? పడుకొంటే ఎంతసేపు పడుకొంటారు? మధ్యలో మెళుకువ వస్తుందా మనందరిలాగా? మెళుకువ వస్తే, వెంటనే నిద్రలోకి జారుకొంటరా? ఇటువంటి ఎన్నో ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి కొత్తగా బాబావారి దగ్గరకి వస్తున్న తెల్ల దొరలని, తెల్ల దొరసానులనీ. మల్లగుల్లాలు పడుతున్నారు వాళ్ళలో వాళ్లే. ఈ సంగతి మెహెరీశునికి తెలియకపోతే కదా వాళ్ళ సందేహ నివృత్తి చేశారీవాళ.

**ప్రపంచమంతటా జరిగే సంగతులన్నీ తమకే తెలుస్తుంటాయన్నారు. విశ్వ వ్యాపకమైన** మనస్సు తమదన్నారు. తాము నిద్రపోనే పోమన్నారు. కొంచెం విశ్రాంతి తీసుకొంటూ వుంటామన్నారు. ఆరు –ఏడు భూమికల మధ్యలో చోటు వుంది. అక్కడ తీసుకొంటాను విశ్రాంతి అని వివరించారు. ఆ స్థితి నుంచి దిగిరావడం చాలా కష్టమన్నారు. కష్టమయినా యిష్టంగా చేస్తాను మానవాళి కోసమని చెప్పకనే చెప్పారు. తమ గది దగ్గర కాపలా మనిషి అవసరం రాత్రిళ్ళు అన్నారు. చీమ చిటుక్కుమన్నా నా విశ్రాంతికి భంగం అవుతుంది ఆరు–ఏడు భూమికల నుంచి వొక్కసారి దిగి రావాల్సి వస్తుంది. అలా అయితే చాలా

కష్టం తమకి అని పేర్కొన్నారు. మెహెరాబాద్‌లో వున్నప్పుడు వో సారి యిలానే జరిగింది. అన్నారు. 'అప్పుడు ఏమయింది ఏదో రణగొణ ధ్వని వినిపించిందట. ఎందుకు, ఎక్కడ జరిగిందీ ఆ చప్పుడు అన్నది అప్రస్తుతం. ఎందుకంటే ఆ చప్పుడుతో విశ్రాంతికి ఎగిరి పోయింది. నేను విశ్రాంతి తీసుకొంటున్న ఆరు - ఏడు భూమికల మధ్య స్థానం నుంచి దిగి రావాల్సి వచ్చింది సడన్‌గా. ఇందువల్ల చాలా కష్టపడ్డాను. అంతా, యింత కష్టం కాదు. ఆ బాధ తట్టుకోలేక నేలపై దొర్లాను. కంట నీరు ఏకధారగా కారింది అని

## నిర్వికల్ప సమాధి - సహజ సమాధి స్థితి

**మెహెరీశుడు చెప్తుంటే, 'అమ్మో! అంత కష్టం వస్తుందా మన ప్రభువుకి,' అని కొట్టుకు పోయారు** శ్రోతలు. ఎట్టి పరిస్థితుల్లోనూ మెహెరునికి నిద్ర భంగం కల్గించకూడదను కొన్నారు. **ఆరు-ఏడు భూమికల మధ్య తాముండే స్థితిని నిర్వికల్ప సమాధి అంటారన్నారు. మీ మధ్యకు** దిగి వస్తే నేను సహజ సమాధి స్థితిలో వుంటానన్నారు. నిర్వికల్ప సమాధి అంటే నేనే భగవంతుడినన్న స్థితి. మరి సహజ సమాధి అంటే అటు భగవత్ చైతన్యం, ఇటు సృష్టి చైతన్యం రెండూ వుంటాయి. భగవత్ చైతన్యం అంటే నేనే దేవుడినన్న ఎరుక. సృష్టి చైతన్యం అంటే -యావత్ సృష్టిని గురించి ఎరుక. ఇందువల్లనే విశ్వభారాన్ని మోయ గలుగుతున్నాను. మానవాళికి దిశానిర్దేశం చేస్తున్నాను. అదే ఆధ్యాత్మికోన్నతికి పునాదులు వేస్తున్నాను. ఇక్కడ మీ మధ్యన కూర్చున్నా, మీతో మాట్లాడుతున్నా నా విశ్వకార్యక్రమం నిరాఘాటంగా సాగుతూ వుంటుంది. నా ముందుకూర్చున్న మీకెవరికీ అంతుచిక్కదు. కాబట్టి బుర్రలు పాడుచేసుకోకండి. అయితే వొక్క మాట. నిర్వికల్ప సమాధి నుంచి సహజ సమాధి స్థితికి దిగి రావాలీ అంటే నరకయాతన పడుతాను. కానీ ఏం చేయను. క్రిందకి దిగి రాక తప్పదు. ఇదొక గురుతరమైన బాధ్యత నాకు. **ఇంకోమాటలో చెప్పాలంటే దివి నుంచి భువికి భగవంతుడు దిగి రావటమంటే యిదే. యుగావతారుని బాధ్యత కూడా యిదే అన్నారు.** **- సశేషం**



## మెహెర్వాన్ దుబాష్ బాబాలో ఐక్యం

**బాబా ట్రస్టు మాజీ సభ్యుడైన మెహెర్వాన్ దుబాష్ 2026 మే** 9న కెనాడా దేశంలో ఒక కారు ప్రమాదంలో తుదిశ్వాస విడిచారని బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నెలల పసి బాలుడిగా బాబా దర్శనం చేసుకున్న దుబాష్, ఆ పిదప తన తుదిశ్వాస వరకూ అవతారుని సేవలో ప్రేమలో ఓలలాడారు. ధన్యుడు దుబాష్.




# మెహెర్‌బాబా మండలి

**అవతారునికి తమ సర్వస్వం అర్పించి, శరణాగతులై** సేవలందించిన బాబావారి సన్నిహిత మండలి అందరూ బాబాలో ఐక్యమయ్యారు. వీరి జీవితాలు బాబా ప్రేమ సందేశానికి ప్రతీకలు. మెహెరాబాద్ కొండపైన స్త్రీ మండలి, కొండ దిగువున పురుష మండలి వారి సమాధులు (60) వున్నాయి. ఆ అద్వితీయ భాగవతోత్తములకి నివాళిగా 'మెహెర్‌బాబా మండలి' పేరిట ఒక చిన్న పుస్తక ప్రచురణ చేపట్టాం. ఈ పుస్తకం గురించి మరిన్ని వివరాలు వచ్చే నెల సంచికలో తెలుసుకుందాం! అందాక జైబాబా.

# మౌన వార్షికోత్సవం - ఆంధ్ర రెస్ట్ హౌస్‌లో వసతి

2026 జూలై 10 మౌన వార్షికోత్సవం సందర్భంగా మెహెరాబాద్‌కి విచ్చేసే బాబా ప్రేమికులకు ఆంధ్రా రెస్ట్ హౌస్ స్వాగతం పలుకుతోందని, కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా రెస్ట్ హౌస్‌లో భోజన, వసతి కోరువారు తమ పేర్లు, చిరునామా తదితర వివరాలను మే 15 నుండి నమోదు చేసుకోవల్సిందిగా కోరుతున్నారు. ఇందుకు ఆఖరు తేది 2026 జూన్ 30. మరిన్ని వివరాల కోసం కార్యదర్శి, మొబైల్ నంబర్ **99121 99978** సంప్రదించగలరు.

## మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026** ఏప్రిల్ నెలలలో 1). డాక్టర్ గోరు సుందరరావు గారి భార్య, శ్రీమతి గోరు నాగమణి, విశాఖపట్నం రూ. 3000/-, 2) శ్రీ తాడేపల్లి మెహెర్ కుమార్, విజయవాడ. రూ. 5,000/- 3). శ్రీ ఇవటూరి వెంకట సన్యాసి రాజు గారు, విశాఖపట్నం, రూ. 2,000/1 **4). తమ పేరు ప్రచురించవద్దని రూ. 1000/-** పంపినారు. **వీరందరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా.**

# మెహెర్‌బాబా పత్రిక ముద్రణ, రవాణా ఖర్చులు




**పత్రిక ముద్రణ, రవాణా, నిర్వహణ ఖర్చులు అనూహ్యంగా పెరిగాయి. సుమారు** పదేళ్ళ క్రితం వరకూ జాతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై బ్యాంకు వడ్డీ 12 శాతం వరకూ వుండేది. ఆ కారణంగానే, వార్షిక చందా రూ. 100/–, జీవిత సభ్యత్వం రూ. 1000/– నిర్ణయించాం. జీవిత సభ్యులు చెల్లించిన నగదుపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రికా నిర్వహణలో నేటికీ వినియోగిస్తున్నాం.

**నేడు బ్యాంకులు ఇస్తున్న వడ్డీ రేట్లలో గణనీయమైన మార్పు వచ్చింది. ఆ కారణంగా ఈ క్రింది నిర్ణయాలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిపాదించడమైంది. 1.వార్షిక సభ్యత్వం రూ. 150/–, 2. జీవిత సభ్యత్వం రూ.2,000/– గా మార్పు చేయడమైంది. ప్రస్తుతం వున్న జీవితసభ్యులు, అంటే ఇంతక్రితం వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లించిన వారు కూడా,** వీలున్న మేరకు, మా ప్రతిపాదనను మన్నించి అదనపు వెయ్యి రూపాయలు మీ వీలువెంబడి పత్రిక చిరునామాకు పంపవల్సిందిగా కోరుతున్నాం. **మా ఈ విజ్ఞప్తిని మన్నించి ఇప్పటికే చాలామంది అదనపు వెయ్యి రూపాయలు చొప్పున పంపుతున్నారు.** జీవిత సభ్యుల చెల్లింపుల వివరాలు ప్రతినెలా పేజి 40లో ప్రచురిస్తున్నాం. పాఠకులు గమనించగలరు. **మీ సహకారం కోరుతూ, మీ సూచనలు, సలహాలు మా వాట్సప్ నంబర్ 99595 53218 తెలియజేయగలరు. జైబాబా.**

# కామారెడ్డి కేంద్ర 32వ వార్షికోత్సవం

2026 మే ఒకటో తేదీన కామారెడ్డి కేంద్ర 32వ వార్షికోత్సవం సందర్భంగా ప్రేమిక సహవాస్ వైభవంగా జరిగింది. శ్రీ జె. సుబ్రహ్మణ్యం కార్యక్రమ నిర్వహణ చేశారు. ప్రేమికుల భజన గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అవతారుని నామం మారు మ్రోగింది. ఈ సమావేశంలో శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ఎ. జనార్ధనరావు, శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, శ్రీమతి శ్యామల, శ్రీ రమణయ్యరాజు, శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ ఉమా మహేశ్వర సింగ్ తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. అనంతరం, ఆంధ్ర సెంటర్ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

# విశాఖపట్నం బాబా కేంద్ర నూతన కార్యవర్గం




**విశాఖపట్నం, గాంధీగ్రాం, షిప్‌యార్డ్ కాలనీ బాబా కేంద్రానికి 2026 –2028 సంవత్సరాలకు గాను ఈ క్రింది నూతన కార్యవర్గాన్ని ఎంపికయినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.**

**1. శ్రీ డి. మెహెర్‌బాబా – అధ్యక్షులు 2. శ్రీ వై. నీలాచలం – ఉపాధ్యక్షులు 3. శ్రీమతి పి. బాయి** మెహెర్ – ఉపాధ్యక్షురాలు 4. శ్రీ ఎన్.వి.యస్. రామారావ్ – కార్యదర్శి 5. శ్రీమతి పి పావని, జాయింట్ సెక్రటరీ, 6. శ్రీ వి. శ్రీనివాస్ – ట్రెజరర్,

**కమిటీ సభ్యులు – శ్రీ వల్లూరి నాగేశ్వరరావు, శ్రీ ఆర్. పైడిరాజు, శ్రీ కె. సత్యారావు,** శ్రీ ఆర్.ఎం.రాజు, శ్రీ హెచ్.శ్రీనివాసరావు, శ్రీ ఎ.ఎల్. కాంతారావు, శ్రీమతి పి. ఆముక్త మెహెర్ ఎంపికయినట్లు తెలిపారు.

# నరసన్నపేట కేంద్ర 18వ వార్షికోత్సవం

2026 ఏప్రిల్ 26, ఆదివారం ఉదయం 9 నుండి నరసన్నపేట మెహెర్‌బాబా సెంటర్ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస్ కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీ బాలగోపాల మెహెర్ ఈశా బాబా సందేశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మెహెర్ మురళి, శ్రీ కృష్ణమ నాయుడు, శ్రీ యస్.యం.ప్రసాద్, శ్రీ భాగేశు, శ్రీ వరప్రసాద్, శ్రీ జామి రామచంద్రరావు, శ్రీ కె.ఎల్.ఎన్.మూర్తి. శ్రీ గుడ్ల రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఆదివారంపేట ప్రేమికులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుండి పలువురు ప్రేమికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

# వెంకట్రావ్‌పేట కేంద్ర 30వ వార్షికోత్సవం




**(వేల్పుల జీవన్ ప్రసాద్)**

**మంచిర్యాల జిల్లా, వెంకట్రావ్‌పేట కేంద్ర 30వ వార్షికోత్సవం సందర్భంగా 2026 ఏప్రిల్** 18వ తేది మ. 1 గంట నుండి రాత్రి 9 గంటల వరకూ, తిరిగి ఏప్రిల్ 19వ తేది ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస్ కార్యక్రమం వైభవంగా జరిగాయి. ఏప్రిల్ 18న అవతారుని చిత్రపటంతో సాయంత్రం 5 నుండి సుమారు 3 గంటలు పురవీధులలో నామసంకీర్తన జరిగింది. ఈ సంకీర్తనలో యావన్మంది గ్రామ ప్రజలు పాల్గొనడం విశేషం. ఉత్తరాదిన వున్న హమీర్‌పూర్ కేంద్ర ప్రేమికులను తలపించేలా వెంకట్రావ్‌పేటలో కార్యక్రమం జరిగింది. మహిళలు తమ ఇళ్ళ వద్ద బాబాకు ఆరతులు పట్టారు. కోలాటం ఆడారు. సాంప్రదాయరీతిలో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ ప్రసాద్‌రాజు, శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, శ్రీ ఎ. జనార్థనరావు, శ్రీ ఎన్. కిషన్‌రావు, శ్రీ రాంచందర్, స్థానిక కేంద్ర అధ్యక్షులు శ్రీ తిప్పని లింగయ్య, శ్రీ నలిమెల రాజు, గ్రామ సర్పంచ్, శ్రీ తిప్పని దమ్మయ్య, శ్రీ గొర్ల రవీందర్ తదితరులు అవతారుని సందేశాలపై ప్రసంగించారు. రెండ్రోజుల సహవాస్ కార్యక్రమం ఆద్యంతం అవతారుని సంకీర్తనలతో వైభవంగా ముగిసింది.

# ఖమ్మం సెంటర్ 63వ వార్షికోత్సవం




**ఖమ్మం సెంటర్ 63 వ వార్షికోత్సవం 2026 ఏప్రిల్ 26న ఘనంగా జరిగింది. శ్రీ శ్రీనివాస్ బాబా** ఖమ్మం కేంద్ర కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. అనంతరం జరిగిన సహవాస్ కార్యక్రమంలో శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ బాల గోపాల మెహెర్ ఈశా, డాక్టర్ బి. కేశవరావు, తదితరులు అవతారుని సందేశాలపై ప్రసంగించారు.

కేంద్ర అధ్యక్షులు శ్రీ రాయల రామచంద్రయ్య 2026 ఏప్రిల్ 6 తేదీన బాబాలో ఐక్యమయ్యారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా బాబా కేంద్ర అధ్యక్షులుగా శ్రీ రాయలవారి సేవలను స్మరించు కుని, వారికి ఘనమైన నివాళి సమర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని బాబాని ప్రార్థిస్తూ, కొన్ని క్షణాలు మౌనం పాటించారు.

## నూతన కార్యవర్గం

**2026 ఏప్రిల్ 16న జరిగిన సర్వసభ్య సమావేశంలలో, ఖమ్మం కేంద్రానికి నూతన కార్యవర్గ సభ్యులుగా ఈ క్రిందివారిని ఏకగ్రీవంగా ఎంపికయినట్లు కార్యదర్శి తెలిపారు.** 1. శ్రీ సింహా రెడ్డి, చైర్మన్, 2. శ్రీ రవి, వైస్ చైర్మన్, 3. శ్రీ కిషోర్ – సెక్రటరీ, 4. శ్రీమతి ఉమ – జాయింట్ సెక్రటరీ, 5. శ్రీ సీతారాములు – ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం శ్రీ రామచంద్రయ్య గారి కుటుంబసభ్యులు ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

# గాజువాక కేంద్రంలో

**గాజువాక కేంద్రంలో ఏప్రిల్ 4 నుండి ప్రతివారం సత్సంగ్ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.** ఈ కార్యక్రమాలలో శ్రీ అభయ్ ఉభాలే బృందం, శ్రీమతి సీత, శ్రీ వల్లూరి నాగేశ్వరావు, శ్రీమతి పావని, శ్రీ నరసింగ్‌రావు, భువనేశ్వర్, శ్రీ వింజమూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. అవతారుని భజన గీతాలు హృద్యంగా ఆలాపించారు. అవతారుని సందేశాలపై వక్తలు ప్రసంగించారు. స్థానిక ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అందరూ చదవదగ్గ రెండు పుస్తకాలు

**మల్లాది రామారావు**




బాబావారి జీవిత చరిత్ర తెలిసిన వారందరూ చదవదగ్గ పుస్తకాలు రెండున్నాయి. అవి ప్రచురించి చాలా కాలమయినా, యింకా వాటికి తెనుగు అనువాదాలు రాలేదు. ఎందుకనో, ఏమో? ఈ వొక్క కారణం వల్లనయినా, ఆ రెండు పుస్తకాలనీ చదవాలి తప్పకుండా ఇంగ్లీషు వచ్చిన వారందరూ. వాటి తెలుగీకరణ త్వరలో జరుగుతుందనీ, ఆ అమూల్య గ్రంథాలు తెలుగునాట అందరికీ అందుబాటులోకి వస్తాయనీ ఆశిద్దాం. ఇంతకీ ఆ పుస్తకాల పేర్లు చెప్పలేదు కదా. 'డాన్ ఆఫ్ రియాలిటీ' ఒక పుస్తకం పేరు. రెండో పుస్తకం పాద్రీ జీవితానికి అద్దం పడుతుంది. కస్బాపేట, మంజలీ–ఈ మీం రోజుల నుంచీ అవతారుని వెంట నడిచిన ఫరేదూన్ నౌరోజి డ్రైవర్‌కి బాబావారు పెట్టిన ముద్దు పేరు పాద్రి.

1903 నవంబరు 29న పూణేలో జన్మించిన వీరు 1982 మార్చి 13న మెహెరాబాద్‌లో కన్నుమూశారు. బాబావారిని ప్రేమిస్తున్నారా అని అడిగారు వొకరు ఆయన్ని, నుదురు చిట్లించి, ఎగా దిగా చూసి పాద్రీ అన్నారు కదా, 'ప్రేమా, గీమా నాకు తెలియదయ్యా. మెహెరాజాద్‌లో వుంటున్నారుగా. వాళ్ళని అడుగు. చెప్తారు నాకు తెలిసిందల్లా బాబా చెప్పిన పని చేయడం. రెండు చేతులనిండా పనిచ్చాడు మెహెరుడు, అని బదులు ఇచ్చారు.

**"చిన్నప్పుడే బాబా దగ్గరకి వచ్చాను. అప్పట్లో ప్రయత్నించాము. ఏమి ప్రయత్నించా** నంటావా? అదే బాబాని అర్థం చేసుకోడానికి ప్రయత్నించా. నా వల్ల కాలేదు. అంతే అప్పటి నుంచీ నేను నేర్చుకొన్న తారక మంత్రం– గురువాజ్ఞ పాటించడం", అని పాద్రీ వో సందర్భంలో అన్నారు. పెద్దగా చదువుకోలేదు కానీ బాబా వారి సేవలో గుజరాతి, హిందీ, ఉర్దూ, మరాఠీ, పార్శీ, ఇంగ్లీషు భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారు. అందుకనే మెహెరాశ్రం, ప్రేమాశ్రమాలలో టీచర్‌గా రాణించాడు. అలనాటి బాబావారి ఫోటోలు మనకీవాళ దొరుకుతున్నాయంటే, దానికి కారణం పాద్రీ గారే. వృత్తిపరంగా మెకానిక్ అయినా, ఫోటోగ్రఫీ పట్ల ఆసక్తితో మెళుకువలు నేర్చుకొని వివిధ భంగిమల్లో బాబావారి ఫోటోలు తీశారు. బాబావారి మొదటి హర్యాన్ యాత్రలో పాద్రీ చాలా ఫోటోలు తీశారు.

డెవలెప్ చేయండి అంటూ, అహమ్మద్‌నగర్‌కి పంపారు తిరుగు ప్రయాణంలో కానీ, అవి 'గమ్యం' చేరిన దాఖలా లేదు. "మాయమయ్యాయి", అంటాడు చరిత్రకారుడు. "బహుశా బాబావారికి యిష్టం లేదేమో, అందుకే ఆ ఫోటోలు పోయాయి", అనేవారు పాద్రీ.

**1960 ప్రాంతం నుంచీ పాద్రీ కర్మభూమి మెహెరాబాద్. ఎప్పుడైనా పిలుపు వస్తే మాత్రం,** మెహెరాజాద్‌కి వెళ్ళడం, పూణే గురుప్రసాద్‌లో బాబావారు వున్నప్పుడు కూడా పిలిస్తే కానీ ఆ పేష్వా నగరానికి వెళ్ళలేదు. హోమియోపతి డాక్టరుగా పాద్రీకి మంచి పేరుంది. ఎవరికి ముందు యిచ్చినా, ఇది బాబా ప్రసాదం జాగ్రత్తగా తీసుకోండి అని చెప్పేవారట. రోగనిర్ధారణ అయ్యాక, మందు సెలెక్ట్ చేశాక, దాన్ని బాబా ఫోటో ముందు పెట్టి మరీ యిచ్చే వాడని అప్పటివారు అంటారు. మెహెరాబాద్‌లో హోమియో వైద్యం చేస్తున్న ఈ తరం వారు కూడా పాద్రీ బాటలో నడుస్తున్నారు. కోపిష్టి కాదు కానీ మాట కరుకుగా వుండేది. ఇప్పుడే కాదు మిస్టర్! టైమ్ పడుతుంది", అన్నమాట పాద్రీ వూత పదం. మొదటి అమరతిథి తర్వాత మెహెరాబాద్‌కి వచ్చిన విదేశీయులు పాద్రీ చుట్టూ గుమి గూడేవారు. సమయం చిక్కినప్పుడల్లా, అలనాటి విశేషాలని కథలు కథలుగా చెప్పేవాడా యన. బాల్యం నుంచీ మెహెరుని వెంట వుండటం వల్ల, అవతారునితో సాంగత్యం గురించి పాద్రీ చెప్తుంటే చెవులు రిక్కించుకొని వినేవారు.

**వో ఉత్తరం డిక్టేట్ చేస్తూ, ఇట్లు భవదీయుడు", అంటూ శ్వాస విడిచిన ధన్యజీవి.** "ఇవి ఆఖరి క్షణాలు పాద్రీకి", అని గమనించిన వ్యక్తి వొకరు ఆయన చెవిలో "మెహెర్‌బాబా," "మెహెర్‌బాబా" అని చెప్పాడు. ప్రభు నామం విన్న పాద్రీ, బాబావారి ఫోటోకేసి చూస్తూ కన్నుముశాడు అంటూ పాద్రీ కథపై తెర దింపారు ఎరిక్ నాడెల్. పాద్రీపై పుస్తకం వ్రాయాలని ఎంతో భోగట్టా సేకరించాడీ అమెరికన్. ఆ కథలకు వో రూపం యిచ్చేలోగా,




అకాల మరణం చెందాడు ఎరిక్. శ్రీమతి హీథర్ నాడెల్ ఆధ్వర్యంలో పాద్రీ పుస్తకం 2020లో వెలుగు చూసింది. జానెట్, టెడ్ జడ్సన్ దంపతులు, బాబ్ స్ట్రీట్, ఎలన్‌వాగ్రై ప్రభుతులు తమ జ్ఞాపకాలను కూడా పొందుపరిచారు. చక్కటి ఫోటోలతో ప్రచురించారు షెరియార్ ఫౌండేషన్ ఈ 160 పేజీల గ్రంధాన్ని.

ఇహ రెండవ పుస్తకానికి వస్తే, ఇదొక పునర్జన్మ వృత్తాంతం. నమ్మకం – అపనమ్మకాలకి అతీతమైన కథ. ప్రభువు సమీపంలో వుండగానే కన్నుమూయాలని ఆశించి, ఆ కోర్కె నెరవేర్చుకున్న నీలూ, యడవల్లి విధ్యగా పుట్టడం గతాన్ని విహంగావలోకనం చేయడం, అడుగు

అడుగునా బాబావారు ముందుండి విద్యను నడిపించడం, కథా వస్తువు ఆద్యంతం ఆసక్తికరంగా ఏకబిగిన చదివించే 180 పేజీల పుస్తకం. ఈ వివరాలను సమీక్షలో కంటే ఎవరికి వారు చదివితేనే బాగుంటుంది. మౌనముద్ర పట్టిన మెహెరావతారుడు పిలిచినా, పిలవకపోయినా, వెన్నుతట్టి వెంట వుండే ప్రభువు అని యడవల్లి విద్య గారు ఘంటాపథంగా చెప్తున్నారీ పుస్తకంలో. నీలుగా ప్రసిద్ధుడైన డాక్టర్ వినాయక్ నీలకంఠ్ గాడ్సే గారి కథకే పరిమితం కాకుండా రచయిత్రి, పాఠకులకి ఎదురయ్యే అనేక చిక్కుముడులు విప్పే ప్రయత్నం చేశారు. విధేయత, ప్రేమ, కోర్కెలు, అహంకారం, క్రోధం, మరణం, ఆత్మసాక్షాత్కారం వంటి విషయాలకి తమదైన శైలిలో వ్యాఖ్యానం చెప్పారు. బాబావారి ఆదేశం మేరకు చేశానీ రచన అంటారు విద్య. నిజమే అనిపిస్తుంది పాఠకులకి.

# జంట నగరాలలో బాబా కార్యక్రమాలు



**MEHER BABA REGULAR PROGRAMS IN TWIN CITIES**

**Sunday Morning :**
10 AM to 12.15 PM, @ P. No. M1, Rd.No. 2, Avenue-3, Kakateya Hills, Madhapur, Hyd - 500081, TS.
**Mob.: 9396702076.**
**Sunday Evening :** 5 PM to 7 PM, @ Panduranga Nagar, Pillar No.161, St. No. 2, Attapur, Hyd. **Mob. : 7416323061.**
**Sunday Evening :** 6 PM to 7 PM, @ Rallagada, Shamshabad, Hyderabad.
**Mob. : 6304719430.**
**Note :** 6 PM to 8 PM Follow AMB Gajuwaka Center Vizag Youtube channel.
**Monday Evening :** 6 PM to 8 PM, @ Plot No.38, R K Nagar, Malkajgiri, Hyd.
**Friday Evening :** 6 PM to 8 PM, @ #3-1-212, Somasundaram Street, Patny Center, Secunderabad. (Hotel Tajmahal backside) **Mob. : 9441216824.**
**Saturday Morning :** 8 AM to 9 AM @ Manonash Cave, Khajaguda Hill, Puppalguda Village, Manikonda, Hyd - 500089, TS. **Mob. : 7702257771.**
**Saturday Evening :** 6 PM to 8 PM (10 Min. Film Show) @ Meher Koti, Esamiya Bazar, Hyd.
**Baba Dhuni :** 12th of every month at sunset @ Koti & Jubilee Hills Center.
**Nagarasankeerthana (**Monthly 6 AM to 7 AM)
1st Sunday - AMB **Malkajgiri** Center, Hyd. | 2nd Saturday - Near **Manonash**
3rd Sunday - AMB Hyderabad Center, **Jubilee Hills,** Madhapur, Hyd
4th Sunday - **Ananda Nilayam**, Hyd

**Reservations for Hostels, Dharmashala, MPR :**
**Accommodations :** Avatar Meher Baba Trust, King's Road, Post Bag 31, Ahilya Nagar, MS 414001. INDIA
E-mail : jaibaba@ambppct.org **Ph : +91-241-2548777,**
Cable : MEHERBABA, AHILYANAGAR.

**Meher Piligrim Retreat (MPR):**
Piligrim Retreat, Avatar Meher Baba Trust, King's Road, Post Bag 31, Ahilya Nagar, MS 414001. INDIA
E-mail : pimco@ambppct.org; **Ph : +91-241-254-8736.**

**Check-In-Procedure :** Indian citizens with prior reservations can check-in at Meher Piligrim Retreat between the hours of 9.00 am to 14.00 pm only.
Visitors with reservation at Hostel D or Dharmashala may check-in.

- 31st Jan - Amarthithi - 25th Feb - Birthday; - 10th July - Silence Day
- 16th Oct - Manonash, Kajaguda; - 14th Nov (nearest Sunday)- Jubilee Hills Center Anniversary

www.ambppct.org | www.avatarmeherbaba.org | www.meherbabatravels.com

హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో నిర్వహించే ప్రతివారం నిర్వహించే బాబా కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ శ్రీ నోరి రామ సుబ్బారావు "ఫ్లెక్సీ సైన్‌బోర్డు" నొకదాన్ని రూపొందించారు.

ఈ సైన్‌బోర్డుని కోఠి బాబా కేంద్రంలో 2026 మే 2న ట్రస్టీ శ్రీ గోపాలకృష్ణ లాంఛనంగా అవిష్కరించారు. జంట నగరాల లోని బాబా ప్రేమికులు తమ ఇంటి ప్రాంగణంలో, లేదా నాలుగు బజార్ల కూడలిలో ఈ సైన్‌బోర్డుని ఏర్పాటు చేయడం ద్వారా ఆసక్తి గల నగర ప్రజలకు తగిన బాబా సమాచారం అందజేసిన వారమౌతారని రామ సుబ్బారావు అన్నారు.

ఈ విషయమై తగు సమాచారం కోసం శ్రీ సత్తయ్య గార్ని (92475 83567) సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

# మెహెరాబాద్‌లో అక్షరాభ్యాసం

**మెహెరాబాద్ బాబా సమాధి ప్రాంగణం. 2026 ఏప్రిల్ నెల. ఉదయం 11 దాటింది.** ఆ సమయంలో ఒక తెలుగు బాబా ప్రేమిక కుటుంబం, తమ మూడేళ్ళ పిల్లవానితో కలిసి వచ్చారు. ఒకరి తర్వాత మరొకరు క్యూలో బాబా దర్శనం చేసుకున్నారు. ఆ చిన్నపిల్లవాని చేతిలో పసుపు, కుంకుమ అద్దిన పలక, బలపం వున్నాయి. ఆపై, పిల్లవాని తల్లితండ్రులు పలక-బలపం కట్టని తమ చేతిలోకి తీసుకుని బాబావారి సమాధిపై వుంచారు. పిల్లగాడిని బాబా పాదాలకు నమస్కరించమన్నారు. ఆ తర్వాత, బాబా సమాధికి ఎదురుగా వున్న టేకుబల్లపై కూర్చుని పిల్లవాని తాత-బామ్మలు చిన్నారి చేత **'జైబాబా'** అని పలకపై రాయించారు. తాత గారి ఒడిలో మనుమడు బుద్ధిగా ఒదిగి కూర్చున్నాడు. మూడుసార్లు 'జైబాబా' అని చక్కగా రాశాడు. ఆపై పిల్లవాని తండ్రి గట్టిగా ఊపిరి తీసుకున్నాడు. ఎందుకంటే, పిల్లవాడు చాలా చురుకైనవాడు. వాడు క్షణం ఖాళీగా వుండడు. బాబా ఎదుట ఈ మాత్రం కుదురుగా కూర్చుంటాడని, చెప్పినమాట ఆలకిస్తాడని వారూహించ లేదు. బాబాకు పిల్లలంటే ఎంతో ఇష్టం కదా! అవతారుడే పలక - బలపం పట్టి వానితో రాయించారనిపించింది. ఆ తర్వాత, టిన్ షెడ్‌కి వెళ్ళి మరోమారు 'జైబాబా నామం' రాసి తృప్తిగా వెనుతిరిగారు ఆ కుటుంబీకులు.

## సందర్భోచితం

**జియస్ఎన్ మూర్తి గారికి పరిచయం అవసరం లేదు. ఆయన సమకాలీనులు ఓ మాట ఇలా చెప్పారు.** అదేమంటే, 1960వ దశకంలో తమ పిల్లవానికి తలనీలాలు తీయించాలని, ఆయన సకుటుంబంగా మెహెరాజాద్‌కి వచ్చారు. తన రాక గురించి ఏరుచ్‌ని కలిసి చెప్పారు. ఈ మాటలు వింటూనే, ఏరుచ్ నిరుత్తరుడయ్యాడు. మా కుల దైవం సమక్షంలో, చిన్నపిల్లలకు ఏడాది నిండేలోగా 'కేశ ఖండన' చేయించడం మా ఆచారం అని నిర్ద్వందంగా చెప్పారు జియస్ఎన్. తాను వచ్చిన పనిని బాబాకు తెలియజేయమన్నారు. **ఐతే,**

బాబా కఠిన ఏకాంతవాసంలో వున్నారు. మండలి సభ్యులు కూడా బాబాని కలవడం లేదు. చెట్లపై వున్న పక్షులు చేసే శబ్దం కూడా వినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. ఇది ఇలావుంటే, శ్రీ జియస్ఎన్ తనతో తెచ్చిన కత్తెరతో పిల్లవాని జుత్తుకు మూడు కత్తెరలు వేసి, తాను వచ్చిన పని ముగిసిందని వెనుతిరిగారట.

**పుట్టు వెంట్రకలు, అక్షరాభ్యాసం తెలుగువారికి అనాదిగా సాంప్రదాయంగా వస్తున్న ఆచారం. ప్రేమగా ఏం చేసినా కర్మకాండ కాదని బాబా ప్రవచించారన్నారు శ్రీ జియస్యన్.**

*

# ప్రేమతో చేస్తే కర్మకాండ కాదు

## కర్మకాండలంటే ఏమిటో బాబా ఇలా వివరించారు

**ఏ కర్మనైనా సరే ప్రేమతో మనస్సుపెట్టి ఆచరిస్తే అది కర్మకాండ కాదు.** అదే కర్మను ఒక క్రతువులాగా, యాంత్రికంగా చేస్తే అది కర్మకాండ అవుతుంది. నాకు పూలదండ వేయటం కూడా కర్మకాండ అవుతుంది. అలాగే, నాకు పూలదండ వేయకుండా వుండటం కూడా కర్మకాండౌవుతుందన్నారు బాబా.మీరు ఆరతి పాడే సమయంలో, మీ మనస్సు ఇతర విషయాల గురించి ఆలోచిస్తుంటే ఆరతి కర్మకాండ అవుతుందన్నారు బాబా. ఇంకా మెహెర్‌బాబా ఇలా అన్నారు. నా ప్రేమికులు నా కోసం చేసే ప్రార్థన, ఆరతి కేవలం నా ఫోటోకి చేస్తే నేనక్కడ వుండను. ఆ ఫోటోలో నేనున్నానని, శ్రద్ధగా మనస్సుపెట్టి, ప్రేమతో చేస్తే నేను తప్పకుండా ఆ ఫోటోలో వుంటానని మెహెర్‌బాబా అన్నారు.

### గురుప్రసాద్‌లో జరిగిన సంఘటన ఇలా వుంది.

**ఒకరోజు గురుప్రసాద్‌లో బాబా దర్శనం ఇస్తుండగా, హఠాత్తుగా వర్షం కురుస్తోంది.** బయట వేచి వున్న బాబా ప్రేమికులు బూట్లు ధరించి వుండటంతో వారు లోపలికి వెళ్ళ లేదు. అది చూసిన బాబా వెంటనే అందరినీ బూట్లతోనే లోపలికి రమ్మనమని ఆదేశించారు. కానీ, ఆ ప్రేమికులు అలా వెళ్ళడానికి తటపటాయిస్తున్నారు. **అప్పుడు బాబా ఏమన్నారంటే, మీరు చెప్పులతో చేసిన దండ నా మెడలో వేసినా, నేనెంతో సంతోషిస్తానన్నారు.** బాహ్యంగా చూపే గౌరవ మర్యాదలు, పొగడ్తలు ముఖ్యం కాదు. **ఏ పనినైనా సరే ప్రేమతో చేస్తే అది ఆధ్యాత్మిక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.** ప్రేమ మాత్రమే కర్మకాండకి నిజమైన ఆరాధనకు గల తేడాని చూపిస్తుంది. ఏ పనైనా ప్రేమతో చేస్తే అది కర్మకాండ కాదని బాబా స్పష్టం చేశారు.




# సేవా కార్యక్రమం

**తీవ్ర వేసవి సందర్భంగా దాహార్తులకు చల్లని మజ్జిగ అందజేస్తున్నట్లు** మల్కాజ్‌గిరి బాబా కేంద్ర ప్రేమికులు తెలిపారు. ఎందరో స్థానికులు ఈ సేవల్ని అందుకుంటున్నారు. ఈ మార్గంలో ప్రయాణించేవారు, ముందుగా తమ దప్పిక తీర్చుకుని, అవతారునికి అభివాదం చేసి తృప్తిగా ముందుకు సాగుతున్నారు.

# అవతార్ మెహెర్‌బాబా ఎవరు?
# బాబావారి సందేశం



* **నీ మనస్సు ఏది చెబితే అది అనుసరించకు.**
  – కామపూరిత ఆలోచనల్ని ఆచరణలో అమలు చేయొద్దు, నా కొంగు గట్టిగా పట్టుకొండి. ఇందుకోసం ధ్యానం, ఉపవాసం ఉండాల్సిన పనిలేదు. ఆహార నియమాలు ఏమీ లేవు.
* అంతా బాబాకే వదిలిపెట్టి, దేని గురించి చింతించ వద్దు.
* నేను మానవ రూపంలో ఉన్న భగవంతుడిని.
* మీ జీవిత లక్ష్యమైన బ్రహ్మైక్యాన్ని, నా కృపతో ఒక్కక్షణంలో పొందగలరు.
* నేను గురువును. అదే సమయంలో దేవుడను.
* నాకు రెండు శరీరాలు ఉన్నాయి.
  1. మానవ శరీరం 2. విశ్వాత్మక శరీరం
* అలాగే, 1. మానవ మనస్సు 2. విశ్వాత్మక మనస్సు ఉన్నాయి.
* నేను అనంత ఆనంద స్వరూపుడిని.

***

**ఆ వేళ 1962 నవంబరు 17. శనివారం.**

**ఆ రోజు పాశ్చాత్య ప్రేమికుడైన హ్యారీ డెడోల్‌చౌ మెహెరాజాద్‌లో బాబాని దర్శించు** కున్నాడు. బాబా అతడ్ని చూస్తూనే, నీవు చివరిసారిగా స్త్రీతో ఎప్పుడు కలిశావని అడిగారు. హ్యారీ ముఖం ఎర్రబడింది. తాను గతంలో కొన్ని తప్పులు చేశానన్నాడు. బాబావారి ఎదుట తన తప్పుని అంగీకరించాడు.

**బాబా అతనితో, "నేను మహా సముద్రుడిని. మంచి-చెడూ అన్నీ ఈ మహా సముద్రంలో** మునిగిపోతాయి. నీవు నా దగ్గరకు వచ్చావు కదా! ఇకపై నీవు దేని గురించి బాధపడొద్దు. నేను నిన్ను క్షమించాను. నీ గతం గురించి ఆలోచించ వద్దు ఇకపై. సంతోషంగా ఉండు, అన్నారు.

## మనస్సు వల్ల

**మనస్సు వల్ల నీవు అనేక ఆలోచనలకు గురవుతావు. దీనివల్ల నీకు శాంతి వుండదు.** ఆనందం ఉండదు అన్నారు బాబా. బాబా ఇంకా ఇలా అన్నారు అతనితో.. **'నీ మనస్సు ఏది చెబితే అది అనుసరించకు. అనేక ఆలోచనలు వస్తూంటాయి, పోతుంటాయి.** కొన్ని ఆలోచనలు మంచివి అయ్యుండవచ్చు. కొన్ని కామపూరిత ఆలోచనలుండవచ్చు. లేదా మరేదైనా చెడు ఆలోచనలూ వుండొచ్చు. ఇలా అనేక అలోచనలు నీ మనస్సులో నిరంతరం వస్తూ పోతుంటాయి. మనస్సు నశిస్తే కాని, ఈ ఆలోచనా తరంగాలు ఆగిపోవు. నీకు వచ్చే ఆలోచనలలో కొన్ని మంచివి, ఉదాత్తమైనవి వుండొచ్చు. ఆ మరుక్షణంలోనే, చెడు ఆలోచనలు, నిరుత్సాహకరమైనవి, నిరాశ నిస్పృహలకు గురిచేసే ఆలోచనలూ వుండొచ్చు. కాబట్టి మనస్సులోకి వచ్చే ఆలోచనల్ని గురించి పట్టించుకోవద్దు. కామపూరిత ఆలోచనలు వస్తే, వాటిని ఆచరణలో అమలు చేయకుండా జాగ్రత్తపడు. స్త్రీ, పురుష బేధం లేకుండా ఎవరితో ఎలాంటి కామపూరిత పనులు చేయవద్దు. నేను నిన్ను క్షమించాను. ఇకపై సంతోషంగా ఉండు అని బాబా హ్యారీ డెడోల్‌చౌతో అన్నారు.

## నా కొంగు గట్టిగా పట్టుకొనండి

**నా కొంగు గట్టిగా పట్టుకొనండి. ఇందుకోసం మీరేమి ఉపవాసం ఉండాల్సిన పనిలేదు.** ఆహార నియమాలు పాటించవల్సిన పన్లేదు. మాంసం, చేపలు, గ్రుడ్లు ఇలా ఏదైనా, మీకేది ఇష్టమైతే ఆ ఆహారం తీసుకునే స్వేచ్ఛ మీకు వుంది. మీరు బాబా ఫోటోకేసి చూస్తూ ధ్యానం చేయనవసరం లేదు. నేడు సమయం ఆసన్నమైంది. త్వరలో నా మౌన విరమణ ప్రకటిస్తాను. ఒకానొక సమయం వస్తుంది. అప్పుడు మీ హృదయంలో నా నిజస్వరూపం కనిపిస్తుంది. అప్పుడు మీ చింతలన్నీ తొలగిపోయి, మీరు ఆశించే ఆనందం మీకు లభిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, అంతా బాబాకే వదిలేయండి. దేని గురించి చింతించకండి. ఈ దేశంలో సాధువులు చాలామంది ఉన్నారు. నేను సాధువుని కాదు. కాబట్టే మీరు ఫలానా ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టమని నేను చెప్పను.

**నేను మానవ రూపంలో ఉన్న భగవంతుడిని. మీ జీవిత లక్ష్యమైన బ్రహ్మైక్యాన్ని దశల** వారీగా కాకుండా, నా కృపతో మీరు ఒక్క క్షణంలో పొందగలరు. కాబట్టి, మీరు ధ్యానంలో, ఏదో ఒక బాబా చిత్రాన్ని చూస్తూ ఏకాగ్రతతో కూర్చోవల్సిన పని లేదు. ఒక సమయం వస్తుంది. అప్పుడు బాబాని మీ హృదయంలోనే స్వయంగా దర్శించగలరు.

నేను గురువును. అదే సమయంలో దేవుడను. మీరందరూ నన్ను అధికాధికంగా ప్రేమించాలని, నా కొంగును గట్టిగా పట్టుకోవాలని కోరుతున్నాను. ఎందుకంటే, నా మౌన విరమణ సమయం సమీపిస్తోంది.

## రెండు శరీరాలు

**1962 డిశెంబరు 2 ఉదయంపూట బాబా మాట్లాడుతూ ఇలా అన్నారు.** నాకు రెండు శరీరాలు ఉన్నాయి. 1. మానవ శరీరం 2. విశ్వాత్మక శరీరం. అలాగే, 1. మానవ మనస్సు 2. విశ్వాత్మక మనస్సు ఉన్నాయి. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడిని ఒప్పించవల్సినప్పుడు, నేను ఆనాడు శ్రీకృష్ణుడిగా కేవలం లిప్తపాటు కాలంలో, ఒక ఝలక్ మాదిరి, నా విశ్వరూప దర్శనం అర్జునుడికి ఇచ్చాను. దాంతో అతనెంతో శక్తిని పొందాడు. ఉద్విగ్నతకు లోనయ్యాడు.

**నేను అనంత ఆనంద స్వరూపుడిని. నా చెంత సర్వ సుఖం ఉంది.**
**కానీ, దాన్ని నేను ఎన్నడూ స్పృశించను.**
**ఆ ఆనందాన్ని లేశమాత్రం కూడా నా కోసం** ఎన్నడూ వినియోగించుకోను.
నాకు చెందిన సుఖాన్ని, ఆ ఆనందాన్ని ఉపయోగించుకోక పోవడమే
నేను అనుభవించే వేదన.
**అవతారుడు తన అనంత ఆనందాన్ని ఉపయోగించుకోగలిగితే,**
ఆయన అనుభవించే బాధను, “బాధ” అని ఎలా పిలవగలరు?
అలాచేస్తే, అవతారుడు స్వయంగా విధించుకున్న ఆ బాధవల్ల మానవాళికి
ఏ ప్రయోజనం ఉంటుంది, అని బాబా ప్రశ్నించారు.
‘మానవ రూపధారిగా అవతరించిన అవతారుడు,
అనంత ఆనందం తనకెంత దగ్గరగా ఉన్నా దాన్ని ఏమాత్రం
ఆస్వాదించడు’, అని అన్నారు.
అందుకే ఏసుక్రీస్తు తాను అనుభవిస్తున్న బాధతో “ఓ తండ్రీ! నన్నెందుకు
ఇలా ఉంచావని రోదించాడు, అని బాబా అన్నారు. ఆయన ఆ మాటల్ని తనతో
తాను చెప్పుకున్నాడన్నారు.
ఈ అవతార కాలంలో నేను క్రీస్తు కంటే అధికంగా బాధలనుభవిస్తున్నాను.
క్రీస్తుకి శిలువ ఒక్కసారే వేశారు.
నేడు నాకు ప్రతిరోజూ శిలువ వేస్తున్నట్లుంది.
అవతారుడు శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా
ఎన్నో బాధలు అనుభవిస్తాడని బాబా అన్నారు. *




# చిత్రమాల

## పూణే – సతారా జాతీయ రహదారి నంబరు 48 వద్ద ఉడతారా గ్రామ సమీపంలో

## స్మారక స్థూప స్థాపన

## 2026 ఏప్రిల్ 14 –30



ఏర్పాట్లు పరిశీలనలో డాక్టర్ వాసుదేవ్



పూణే – సతారా జాతీయ రహదారి నంబరు 48పై

# జీవిత సభ్యత్వం / అదనపు జీవిత సభ్యత్వం

## 2026 ఏప్రిల్ - మే నెలలలో పంపిన వారి వివరాలు

1. శ్రీ రమణ గోర్లె, విజయనగరం రూ. 1000/-
2. శ్రీమతి జయశ్రీ, శ్రీ జె. రామారావు, అనంతపురం రూ. 1000/-
3. శ్రీ రామాచారి గుండోజు, శ్రీనగర్, వయా వర్ని రూ. 1000/-

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్,** యాప్రాల్,
ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
**ఫోన్: 99595-53218. email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi Printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, Published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**